بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపుటి: 7

సంచిక : 41

వార్షిక చందా 600/-రూ॥

13 అక్టోబర్ 2022 క్రీ. శ. 16 రబీఉల్ అవ్వల్ 1444 హి.ఖ. 13 ఇఖా 1401 హి. శ.


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

خُذُوۡا مَاۤ اٰتَیۡنٰکُمۡ بِقُوَّۃٍ وَّاذۡکُرُوۡا مَا فِیۡہِ لَعَلَّکُمۡ تَتَّقُوۡنَ

**అనువాదం:** వేము మీకు ప్రసాదించిన దానిని గట్టిగా పట్టుకొనుడు, మీరు ధర్మనిరుతులు అగుటకు దానిలో ఉన్నదంతయు జ్ఞాపకము పెట్టుకొనుడు.

**(ఆరాఫ్: 172).**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యిద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

ఒకవేళ కేవలం దేవుడు ఒక్కడే అని, అతనికి సాటి మరెవ్వరు లేరని విశ్వసించడమే చాలినచో ఇది కూడ ఒక విధమైన అన్యారాధనయే అగును. ఎందుకనగా " లా ఇలాహ్ ఇల్లల్లాహు తోపాటు ముహమ్మదుర్రసూ లుల్లాహ్" ను మమేకం చేయడమైనది. **హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఉపదేశాలు:**

అదే విధముగా ఈ దురదృష్ట కాలంలో హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ను విశ్వసించడం, మరియు విముక్తి పొందుటకు వారి( స.అ.స) ని అనుసరించడం తప్పనిసరి అని భావించనివారు ముసల్మానులలో అనేకులు జన్మించినారు, అంతేగాకా స్వర్గంలోకి ప్రవేశించుటకు కేవలం అల్లాహ్ తాలా ఒక్కడే అని అతనికి సాటి ఎవ్వరు లేరని విశ్వసించినచో సరిపోతుందని భావిస్తున్నారు. మరికొందరు కేవలం అనత్యవాడుచు, నన్ను బాధింపజేయుటకు లేదా తమ తప్పుడు అలోచనల వలన నాపై అనేక అపవాధులను సంధించుచున్నారు. ఈ అపవాధుల ఆధారంగా ప్రజలను ఈ జమాఅత్ నుండి వేరుచేయుటయే లక్ష్యంగా కొందరు ప్రయత్నిస్తుండగా, మరికొందరి స్వభావాలు ధార్మిక సూక్ష్మాంశాలను అర్ధం చేసుకొనుటకు ఆసక్తిని చూపించడం లేదు. వారి స్వభావంలో చెడు ఉద్దేశం లేకున్నను, అర్థం చేసుకొను వివేకం గాని, లేదా వాస్తవాన్ని స్వయంగా పరీక్షించి తెలుసుకొనునంత పరిజ్ఞానం కూడ వారికి లేదు. అందువలనే నేను ఈ అంశం చివరిలో వారందరి అనుమానాలన్నింటిని దూరం చేయడమునే ఔచిత్యముగా భావించితిని.

ఈ అనుమానాలను దూరం చేయుటకు ప్రత్యేక శ్రద్ద చూపవలసి ఉంటుందని నేను ఏనాడు భావించలేదు. ఎందుకనగా నేను రచించిన అనేక గ్రంథాలలో ఇలాంటి అభ్యంతరాలకు అనేక చోట్ల సమాధానాలు వ్రాసినాను. కాని ప్రస్తుత రోజులలో బటాలా ప్రాంతానికి చెంది అసిస్టెంట్ సర్జన్‌గా పని చేయుచున్నా అబ్దుల్ హకీం ఖాన్ అనే ఒక వ్యక్తి గతంలో మన జమాఅత్‌లోని ఒక సభ్యుడు, కాని అతి తక్కువ కలయికల వలన, సత్పురుషుల సాన్నిహిత్యం లభించనందున, ధార్మిక వాస్తవాలు సరిగా తెలియనందున మరియు అహంకారం, మూర్ఖత్వంల కలయికల వలన, చెడు తలంపు, అనుమానపు కూపంలో కూరుకపోయినందున అతడు తన దురదృష్టం కొద్ది మతభ్రష్టుడయ్యి ఈ జమాఅత్‌కే బద్ద శత్రువుగా మారెను. అంతేగాకుండ తనకు సాధ్యమైనంతవరకు దేవుని దివ్యవంతమైన కాంతిని మసకబాపడం కొరకు తన మూర్ఖత్వపు రచనలలో విషంను విరజిమ్ముచు దేవుడు తన స్వహస్తలతో వెలుగునింపిన జోతిని ఆర్పుటకు ప్రయత్నించుచున్నాడు. అందుకొరకే సంక్షిప్తంగానైన అతని అపవాధనలలో ప్రజలకు ఉపయోగపడే కొన్నింటికైన సమాధానాలు వ్రాసి అందరికి చేరువయ్యేలా చూడలని నిర్ణయించుకొంటిని ఎందుకనగా ప్రజలు తమ పనులలో నిమగ్నమవుట వలన నా రచనలన్నింటిని చదివి ఆయా అపవాధనలకు సమాధానాలు వెతుక్కొవడం సాధ్యము కాని పని.

అందువలనే అబ్దుల్ హకీం మతభ్రష్టుడగుటకు గల కారణాలను వ్రాయవలసి వచ్చుచున్నది. ఆ కారణాలు ఏమిటినగా, పరలోకములో విముక్తి పొందుటకు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించవలసిన అవసరం లేదని. అంతేగాకుండ దేవుడు ఒక్కడే, అతనికి సమానులు ఎవ్వరు లేరని విశ్వసించినచో (అతడు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త స.అ.సం ను అసత్యుడని భావించిన కూడ) విముక్తి లభించును అనునది అబ్దుల్ హకీం యొక్క విశ్వాసం. ఈ విశ్వాసం ప్రకారం అతని దృష్టిలో ఒక వ్యక్తి ఇస్లాం నుండి మత భ్రష్టుడైనప్పటికి విముక్తి పొందగలడని, మతభ్రష్టులను శిక్షించినచో వారిపై దౌర్జన్యం చేసినట్లుగా భావించబడునను అర్థం. ఉదాహరణకు అబ్దుల్ ఘఫూర్ అనే వ్యక్తి మతభ్రషష్టుడై ఆర్యసమాజంలో చేరిపోయి తన నామమును ధర్మ్‌పాల్‌గా మార్చుకోని. పైగా రాత్రంభవకు ్య హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కించపర్చడం, దూషించడం వంటి పనులు చేయుచున్నా, అట్టి వ్యక్తి కూడ అబ్దుల్ హకీం దృష్టిలో ఏ ఆటంకం లేకుండ స్వర్గంలో చేరును. ఎందుకనగా ఆర్యులు విగ్రహారధన చేయరు. కావున ఈ విశ్వాసము ప్రకారము ప్రవక్తల అవతరణ కేవలం వ్యర్థమైన, అనవసరమైన పక్రియగా మారునని వివేకవంతులందరు గ్రహించెదరు. ఎందుకనగా ఒక వ్యక్తి ప్రనవక్తను తిరస్కరించి, అతనితో శత్రుత్వం పెంచుకొని కూడ కేవలం దేవుడు ఒక్కడే అని విశ్వసించినంత మాత్రమునే విముక్తి పొందినచో, ఈ ప్రక్రియ ద్వారా ప్రవక్తలందరు ఈ ప్రపంచముపైకి కాలక్షేపంనకు పంపించబడుచున్నారని, ❖ లేదా వారు అవతరించకున్నను ప్రపంచములో పనులు కొనసాగును అని, మరియు వారి ఉనికితో ఈ ప్రపంచమునకు ఏ అవసరము లేదని అర్థం. ఒకవేళ కేవలం దేవుడు ఒక్కడే అని, అతనికి సాటి మరెవ్వరు లేరని విశ్వసించడమే చాలినచో ఇది కూడ ఒక విధమైన అన్యారాధనయే అగును. ఎందుకనగా " లా ఇలాహ్ ఇల్లల్లాహు తోపాటు ముహమ్మదుర్రసూ లుల్లాహ్" ను మమేకం చేయడమైనది .

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

హజ్రత్ సాహెల్ బిన్ సఅది రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు. వారు ఇలా తెలిపారు. ఒక మహిళ బుర్దాను తీసుకొని వచ్చింది. బుర్దా అంటే ఏమిటో మీకు తెలుసా? అని మరల అడిగారు. అందుకు తెలుసు, అది అంచుకల్గిన దుప్పటి అని సమాధానం ఇచ్చారు. ఆ మహిళ ఇలా విన్నవించు కున్నది. ఓ రసూలుల్లాహ్! నేను ఈ దుప్పటిని మీకు బహూక రించడం కోసం నా చేతులతో తయారు చేశాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ దుప్పటిని తీసుకున్నారు. హుజూర్ (స)కు ఆ దుప్పటి అవసర ముండెను. ఆ తరువాత హుజూర్ (స) ఆ దుప్పటిని తమ ఒంటిపై వేసుకొని మా వద్దకు బయటికి వచ్చారు. ప్రజలలో నుండి ఒక వ్యక్తి ముందుకు వచ్చి ఓ రసూలుల్లాహ్ ! ఆ దుప్పటిని నాకు ఇవ్వండి. నేను దానిని వాడుకుంటాను అని యాచించాడు. అందుకు హుజూర్ (స) సరే అని అన్నారు. ఆ తరువాత కొంత సమయం హుజూర్ (స)సమావేశంలో కూర్చున్నారు. మరల ఇంట్లోకి వెళ్ళి ఆ దుప్పటిని మడత వేసి ఆ వ్యక్తికి ఇచ్చారు. ప్రజలు అతనితో నీవు చేసిన పని ఏమి బాగాలేదు , హుజూర్ (స) ఏదియు కాదని అనరనే విషయం నీకు తెలిసి కూడ నీవు ఎందుకు అడిగావు అని మంద లించారు. అందుకు ఆ వ్యక్తి 'దేవుని ప్రమాణం! నేను మరణించినచో నా శవ వస్త్రం కోసమని దానిని యాచించాను అని సమాధానం ఇచ్చాడు. హజ్రత్ సాహెల్ రజి ఇలా అన్నారు. ఆ దుప్పటియే ఆ వ్యక్తికి శవ వస్త్రంగా ధరింపజేశారు. (బుఖారి కితాబుల్ బుయూఅ సంపుటి4, ప్రచురణ 2008).


**ఈ సంచికలోని అంశాలు:**

1⇔ జుమా ప్రసంగం 26 ఆగష్టు 2022 ............ 2వ పేజీలో.

2 ⇔ హుజూర్ అన్వర్ గారి జర్మనీ దేశానికి చెందిన పర్యటనలు. దివి 1 జులై 2013 .

.....



జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్హు గారు సిరియావైపు పంపించిన సైన్యాలను గూర్చిన ప్రస్తావన కొనసాగుతున్నది. ఈ సైన్యాలను శత్రువుల దుష్టత్వాలను అడ్డుకోవడానికి పంపించడం జరిగింది. గత జుమా ప్రసంగంలో మూడు సైన్యాలను గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఈ క్రమంలో నాలుగవ సైన్యం హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి గారిది.

హర్కిల్‌కు ఇస్లామీయ సైన్యపు రాకను గూర్చి తెలియగానే అతడు ముందుగా తన జాతి ప్రజలను సమావేశ పర్చి వారితో ఇలా అన్నాడు. నా అభిప్రాయం మేరకు మీరు ముసల్మానులతో సంధిని కుదుర్చుకోండి. దేవుని ప్రమాణం! ఒకవేళ మీరు వారితో సిరియాలోని సగం పంటలను చెల్లించు షరతుపై సంధి చేసుకున్నచో మీ వద్ద మిగిలిన సగం పంటలు, మరియు రోమన్ సామ్రాజ్యం మీ చేతిలో ఉంటుంది.

అజ్నాదైన్ విజయం తరువాత హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి హజ్రత్ అబూబకర్ రజికు ఒక లేఖ ద్వారా శుభవార్తను తెలియజేశారు.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 26 ఆగష్టు 2022, (26 జహూర్ 1401 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్హు గారు సిరియావైపు పంపించిన సైన్యాలను గూర్చిన ప్రస్తావన కొనసాగుతున్నది. ఈ సైన్యాలను శత్రువుల దుష్టత్వాలను అడ్డుకోవడానికి పంపించడం జరిగింది. గత జుమా ప్రసంగంలో మూడు సైన్యాలను గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఈ క్రమంలో నాలుగవ సైన్యం హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి గారిది. ఈ సైన్యంను గూర్చి ఈ విధముగా లిఖించబడింది. హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి నాయకత్వంలో సిరియా వైపు మరొక సైన్యాన్ని పంపారు. హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి సిరియాకు వెళ్ళడానికి ముందు ఖజాఅ ప్రాంతంలోని ఒక భాగానికి జకాత్ మరియు దాన ధర్మాల సేకరులుగా నియమించబడ్డారు. ఖజాఅ ప్రాంతపు రెండవ భాగపు జకాత్ మరియు దాన ధర్మాల సేకరులుగా హజ్రత్ వలీద్ బిన్ ఉఖ్బా రజి నియమించ బడ్డారు. హజ్రత్ అబూబకర్ రజి సిరియావైపు అనేక సైన్యాలను పంపించాలని నిర్ణయించుకున్న తరుణంలో వారికి హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజిను కూడ సిరియా పంపాలని భావించారు. కాని వారు గతంలో అందించిన సేవల వలన. హజ్రత్ అమర్ రజి సేవల వలన అనగా వారు ధర్మభ్రష్టుల తిరుగుబాటును అణిచివేయుటలో పాల్గొన్నందున హజ్రత్ అబూబకర్ రజి వారికి మీకు ఇష్టమున్నచో ఖజాఅ ప్రాంతంలోనే జకాత్ సేకరులుగా ఉండవచ్చును లేదా సిరియా వైపు వెళ్ళి అక్కడి ముసల్మానులకు బలాన్ని చేకూర్చవచ్చుననే అనుమతిని ఇచ్చారు. (అల్ బిదాయత్ వన్నిహాయత్ సంపుటి 4, భాగం 7, పుట 3, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2001) (హజ్రత్ సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్ అనువాదం , పుట 340, ప్రచురణ బుక్ కార్నర్ షోరూం, జీల్హం.)

ఈ క్రమంలోనే హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజికు ఒక లేఖ వ్రాసారు. ఓ అబూ అబ్దుల్లాహ్! నేను నిన్ను నీ ఇహపరలోకాలకు ప్రయోజన కరమైన కర్తవ్యంపై నియమించాలను కుంటున్నాను. నీవు చేపట్టుచున్న పని కంటే చేపట్టబోయే పనిని ఎక్కువగా ఇష్టపడాలి.

అందుకు సమాధానంగా హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి హజ్రత్ అబూబకర్ రజికు ఈ విధముగా వ్రాసారు. నేను ఇస్లాం యొక్క బాణాలలో ఒక బాణాన్ని, అల్లాహ్ తరువాత మీరు రజి ఒక్కరే ఆ బాణాలను సంధించాలని, అందుకు వాటినన్నింటిని ఏకం చేయాలని చూస్తున్నారు. ఆ బాణాలలో నుండి మీ ఇష్టమైన బాణాన్ని మీకు ఎక్కువగా ఆందోళన కల్గిస్తున్న, కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రాంతం వైపు, ఎక్కువగా భయపెడుతున్న వైపు సంధించగలరు. (తారీఖే తిబ్రి, భాగం 2, పుట 332, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ లిబ్నాన్ 2012).

అనగా నేను ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైన వెళ్ళుటకు సిద్ధముగా ఉన్నాను అని అర్థం.

హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి మదీనాకు చేరుకోగా, హజ్రత్ అబూబకర్ రజి వారికి మీరు మదీనా పొలిమేరలో గుడారాలు వేసుకోండి. ఫలితముగా చుట్టు ప్రక్కల నుండి ప్రజలు వచ్చి వారి రజి వద్ద ఏకమైతారని భావించారు. ఖురైష్ తెగలోని ప్రముఖులందరు వారి రజి వద్ద ఏకమైయ్యారు. సిరియావైపు బయలు దేరుటకు నిశ్చయించుకోగానే హజ్రత్ అమర్ బిన్ ఆసన్ రజిను మదీనాకు పిలిపించు కున్నారు. వారు రజి మదీనాకు చేరుకున్నారు. హజ్రత్ అబూబకర్ రజి మరల వారిని తమ కోసం ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం మదీనా బయట వేచి యున్నచో సైన్యంలో చేరుటకు ప్రజలు వస్తారని తెలిపారు. కావున వారు రజి బయలుదేరుటకు నిశ్చయించుకోగా, హజ్రత్ అబూబకర్ రజి వారికి వీడ్కోలు పలుకుటకు వచ్చారు. ఆ సమయంలో ఇలా అన్నారు. ఓ అమర్! నీవు అనుభవజ్ఞుడివి, మంచి సలహాలు ఇచ్చేవాడి. యుద్ధ నేర్పును కూడ కల్గినవాడివి. మీరు మీ జాతికి చెందిన ప్రముఖులతో మరియు సంస్కరించబడిన ముసల్మానులతో వెళ్ళుచున్నారు. మీరు మీ సోదరులను కలుసుకుంటారు. కావున వారికి మంచి చేయుటలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని వహించకుము. వారికి శ్రేష్టమైన సలహాలు ఇచ్చే అవకాశాన్ని కల్పించండి. ఒకవేళ మీ వద్ద ఏదైన మంచి వ్యూహం ఉన్నచో దానిని తప్పకుండా ఆచరించండి. అందుకు హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి ఇలా సమాధానం ఇచ్చారు. మీరు నాపట్ల ఎంతో నమ్మకాన్ని కల్గియున్నారు. కావున నేను ఆ నమ్మకాన్ని పూర్తి చేసి చూపుతాను. మీరు నా పట్ల కల్గిన అభిప్రాయాన్ని వమ్ము చేయకుండా నడుచుకుంటాను. హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి తన సైన్యంతో సిరియా వైపు బయలుదేరినారు. ఆ సమయంలో వారి రజి సైన్యం 6 నుండి 7 వేల సంఖ్యలో ఉన్నది. వారు ఫలస్తీన్ వైపు బయలుదేరినారు.

హజ్రత్ అమర్ రజి వెయ్యి మంది సైనికులతో కూడిన ఒక పటాలమును సిద్ధం చేసుకున్నారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి నాయకత్వంలో రోమన్‌ల వైపు బయలుదేరినారు. ఈ పటాలము రోమన్‌లతో యుద్ధం చేసింది. శత్రువు బలాన్ని నాశనం చేశారు. వారిపై విజయాన్ని సాధించారు. కొందరు ఖైదీలతో తిరిగి వచ్చారు.

హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి ఆ ఖైదీలను ప్రశ్నించారు. ఫలితముగా రోమన్ సైనికులు రువైస్ నాయకత్వంలో ముసల్మానులపై అకస్మత్తుగా దాడి చేయుటకు సిద్ధముగా ఉన్నదనే విషయం తెలిసింది. ఆయా సమాచారం మేరకు హజ్రత్ అమర్ రజి తమ సైన్యాన్ని క్రమబద్ధీకరించి బలపర్చినారు. ఫలితముగా రోమన్‌లు అకస్మత్తుగా దాడి చేసినప్పుడు ముసల్మానులు వారి దాడులను అడ్డుకోవడంలో సఫలీకృతులైనారు. అందువలన రోమన్‌సైనికులు తప్పని పరిస్థితులలో వెనుకకు వెళ్ళిపోయారు. ఆ తరువాత వారిపై ప్రతిదాడి చేసి రోమన్‌ల సైనిక బలాన్ని నాశనం చేశారు. దానితో రోమన్‌లు పూర్తిగా యుద్ధ మైదానాన్ని వీడి పారిపోయారు. ఇస్లామీయ సైన్యం వారిని వెంబడించింది. రోమన్‌ల వేలాది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితోనే ఈ యుద్ధం ముగిసింది.

(సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజి వ్యక్తిత్వం, వ్యవహార శైలి, అలీ ముహమ్మద్ సేలాబి, అనువాదం. పుట 448-449, అల్ ఫుర్ఖాన్ ట్రస్ట్ ఖాన్ ఘడ్, పాకిస్తాన్)

ఆ సైన్యాలను పంపిన తరువాత హజ్రత్ అబూబకర్ రజి నిచ్చింతగా ఉన్నారు. అల్లాహ్ తాలా ఆ సైన్యాల ద్వారా ముసల్మానులకు రోమన్‌లపై విజయాన్ని ప్రసాదిస్తాడు అనే ఖచ్చితమైన నమ్మకం హజ్రత్ అబూబక్ రజి గారికి ఉన్నది. అందుకు కారణం ఆ సైనికులలో ఒక వెయ్యి మందికి పైగా ముహాజిర్ మరియు

అన్సార్ అనుచరులు ఉన్నారు. వారందరు అన్ని క్లిష్ట సమయాలలో ఎంతో విధేయతను ప్రదర్శించారు. ఇస్లాం ప్రారంభ కాలంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారితో చిన్న పెద్ద యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. వారిలో బదర్ యుద్ధంలో పాల్గొన్నవారు కూడ ఉన్నారు. అట్టి అనుచరులను గూర్చి వారు రజి అనగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ దైవం సన్నిధిలో ఈ విధముగా దుఆ చేశారు. ఓ అల్లాహ్! ఒకవేళ నీవు ఈ రోజు ఈ చిన్న సమాజాన్ని నాశనం చేసినచో భవిష్యత్తులోఈ భూమండలంపై నిన్ను ఆరాధించేవారు ఎవరు ఉండరు.

(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ అక్బర్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్ అనువాదం షేక్ ముహమ్మద్ అహ్మద్ పానిపత్, పుట 322, ఇల్మ్ వ ఇర్ఫాన్ పబ్లికేషన్ లాహెూర్ 2004)

మరల ఇలా లిఖించబడింది: రోమన్ సామ్రాజ్య చక్రవర్తి ఆ సమయంలో ఫలస్తీన్‌లోనే ఉన్నాడు. అతనికి ముసల్మానుల ఏర్పాట్లను గూర్చి తెలిసిన వెంటనే అతడు తన ప్రాంత నాయకులను ఏకం చేసి వారి ముందు రెచ్చగొట్టు ప్రసంగాలు చేశాడు. వారందరిని ముసల్మానులకు వ్యతిరేకముగా యుద్ధం చేయడానికి సిద్ధం చేశాడు. అతడు ముసల్మానులను గూర్చి ఇలా అన్నాడు: వారు ఆకలికి అలమటించే వారు, సరిగా బట్టలు కూడలేనివారు. ఖచ్చితమైన మతంలేనివారు. అరబ్ ఎడారి నుండి బయలుదేరి మీపై దండయాత్ర చేయాలని చూస్తున్నారు. మీరు వారికి ఎలాంటి గుణపాఠం నేర్పాలి అంటే జీవితంలో మరెప్పుడు కూడ వారు మీవైపు కన్నెత్తి చూడడానికి సాహసించకూడదు. యుద్ధ సామాగ్రి, సైన్యం ద్వారా మీకు పూర్తి స్థాయిలో సహాయం అందించబడును. మీపై నియమించబడిన నాయకులను మీరు మనస్ఫూర్తిగా అనుసరించాలి. వారి పట్ల విధేయతను చూపాలి. అప్పుడే విజయం మిమ్ములను వరిస్తుంది. హర్కిల్ అక్కడి ప్రజలను తన ఉపన్యాసంతో అరబ్‌లకు వ్యతిరేకముగా రెచ్చగొట్టాడు. ముసల్మానులకు వ్యతిరేకముగా వారిలో ద్వేషాన్ని నింపాడు. ఫలస్తీన్ ప్రజలను కూడ ముసల్మానులకు వ్యతిరేకముగా సిద్ధము చేశాడు. ఆ తరువాత హర్కిల్ దిమిష్కస్‌కు వచ్చారు. అక్కడి నుండి హిమస్ మరియు ఇంతాకీయాకు చేరుకున్నాడు. ఫలస్తీన్ వలే ఆయా ప్రాంతాలలో కూడ విద్వేష కరమైన ప్రసంగాలు చేశాడు. అక్కడి ప్రజలను కూడ ముసల్మానులకు వ్యతిరేకముగా రెచ్చగొట్టి వారిని కూడ యుద్ధానికి సిద్ధం చేశాడు. ఆ తరువాత స్వయముగా ఇంతాకీయాను కేంద్రముగా చేసుకొని ముసల్మానులకు వ్యతిరేకముగా యుద్ధ సన్నహాలు చేయసాగాడు. (హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్, పుట 347. అనువాదం షేక్ ముహమ్మద్ అహ్మద్ పానిపత్, ఇల్మ్‌వ ఇర్ఫాన్ పబ్లికేషన్స్ లాహెూర్, 2004)

సిరియాలో రోమన్‌లకు చెందిన రెండు సైన్యాలున్నాయి. ఒకటి ఫలస్తీన్‌లో రెండవది ఇంతాకియాలో. ఈ రెండు సైన్యాలు ఈ క్రింది ప్రాంతాలను తమ కేంద్రాలుగా చేసుకున్నాయి. ఒకటి ఇంతాకీయా. ఈ నగరం రోమన్ సామ్రాజ్యంలో సిరియా యొక్క రాజధానిగా ఉండేది. రెండవది: ఖిన్నస్రీన్. ఈ నగరం సిరియా సరిహద్దు ప్రాంతంలో గల వాయువ్య దిశలో ఫారిస్‌కు ఎదురుగా ఉన్నది. మూడవది: హిమస్: ఈ నగరం కూడ సిరియా సరిహద్దు ప్రాంతంలోనే ఈశాన్య దిశలో ఫారిస్‌కు ఎదురుగా గలదు. నలుగవది: అమ్మాన్. బల్ఖా దేశానికి ఇది రాజధానిగా ఉండేది. ఇక్కడ సురక్షితమైన, పటిష్టమైన కోటలు ఉన్నాయి. 5వది: అజ్నాదైన్. ఇది ఫలస్తీన్‌కు దక్షణ దిశలో రోమన్ సామ్రాజ్యపు సైనిక కేంద్రముగా ఉండేది. ఈ నగరం అరబ్ యొక్క తూర్పు, పశ్చిమ సరిహద్దులతో పాటుగా ఈజిప్ట్ సరిహద్దులు కూడ కలిసి ఉన్నాయి. 6వది: ఖైసారియ్య. ఇది ఫలస్తీన్ యొక్క ఉత్తర దిశలో ఉన్నటు వంటి హైఫా నుండి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఆ నగరపు శిథిలాలు నేటికి ఉన్నాయి. రోమన్‌ల ఆయుధ కేంద్రముగా ఇంతాకీయా లేదా హిమస్‌లు ఉండేవి. (సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజి వ్యక్తిత్వం, వ్యవహార శైలి. అలీ ముహమ్మద్ సేలాబి, అనువాదం పుట 450, అల్ ఫుర్ఖాన్ (ట్రస్ట్ ఖాన్ ఫుడ్, పాకిస్తాన్)

మరొక కథనములో ఈ విధముగా గలదు: హర్కిల్‌కు ఇస్లామీయ సైన్యపు రాకను గూర్చి తెలియగానే అతడు ముందుగా తన జాతి ప్రజలను సమావేశ పర్చి వారితో ఇలా అన్నాడు. నా అభిప్రాయం మేరకు మీరు ముసల్మానులతో సంధిని కుదుర్చుకోండి. దేవుని ప్రమాణం! ఒకవేళ మీరు వారితో సిరియాలోని సగం పంటలను చెల్లించు షరతుపై నంధి చేసుకున్నచో మీ వద్ద మిగిలిన సగం పంటలు, మరియు రోమన్ సామ్రాజ్యం మీ చేతిలో ఉంటుంది. వారు సిరియా మొత్తాన్ని మరియు రోమన్ సామ్రాజ్యపు సగ భాగాన్ని జయించడం కంటే ఇదే చాలా ఉత్తమం అని సలహా ఇచ్చాడు. కాని రోమన్ ప్రజలు లేచి వెళ్ళిపోయారు. వారి మాటను వినలేదు. అందువలన అతడు వారిని ఏకం చేసి హిమస్ ప్రాంతానికి తీసుకవెళ్ళాడు. అక్కడ వారు సైనిక ఏర్పాట్లు మరియు యుద్ధ సన్నహాలు చేసుకోసాగారు. హిమస్ తరువాత హర్కిల్ ఇంతాకియాకు చేరుకున్నాడు. అతని వద్ద చాలా పెద్ద సంఖ్యలో సైన్నం ఉన్నందున అతడు ముసల్మానుల ప్రతి చిన్న సైన్యాన్ని ఎదురించుటకు వేరు వేరు సైన్యాలను పంపించాలని, తద్వారా ముసల్మానుల సైన్యాలు ఏకమై బలమైన సైన్యంగా మారక ముందే ఆయా సైన్యాలను బలహీన పర్చాలని నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలోనే అతడు తన సోదరుడైన తజారిఖ్‌కు 90వేల సైన్యాన్ని ఇచ్చి హజ్రత్ అమర్ రజికు పోటిగా మరియు జర్జా బిన్ తూజర్‌ను హజ్రత్ యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ రజికు పోటిగా పంపించాడు. అదే విధముగా ఖైఖార్ బిన్ నస్తూస్‌కు 60 వేల సైన్యాన్ని ఇచ్చి హజ్రత్ అబూ ఉబైదహ్ రజికు పోటిగా, దురాఖిస్‌ను హజ్రత్ షుర్‌హబీల్ బిన్ హస్నా రజికు పోటిగా పంపాడు.

(అల్ కామిల్ ఫిత్తారీఖ్, సంపుటి 2, పుట 255, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2006) (హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి హైకల్ పుట 347)

హజ్రత్ అబూ ఉబైదహ్ బిన్ జర్రాహ్ రజి జాబియా సమీపంనకు చేరుకోగా, హర్కిల్ ఇంతాకియాలో ఉన్నాడు అని, మీకు వ్యతిరేకముగా అతడు ఎంత పెద్ద సైన్యాన్ని తయారు చేశాడనగా, గతంలో ఇంత పెద్ద సైన్యాన్ని అతని తాత ముత్తాతల కాలంలోగాని, మీ కంటే ముందు జాతుల కోసం గాని తయారు చేసినట్లుగా లేదని తెలిపాడు.

విషయం తెలియగానే హజ్రత్ అబూ ఉబైదహ్ రజి హజ్రత్ అబూబకర్ రజికు ఈ విధముగా లేఖ వ్రాసారు: రోమన్‌సామ్రాజ్య చక్రవర్తి హర్కిల్ సిరియాలోని ఇంతాకియా అనే నగరంలో ఉన్నాడు. అతడు తన సామ్రాజ్యంలో ఉన్న ప్రజలందరిని ఏకం చేయుటకు కొంత మందిని పంపించాడు. కావున ప్రజలు ఇబ్బందికరమైన మరియు సులువైన మార్గాల ద్వారా అతని వద్దకు చేరుకుంటున్నారు. కావున ఈ విషయాన్ని గూర్చి మీకు సమాచారం అందించాలని, ఫలితముగా మీరు ఇందుకు అనుగుణమైన నిర్ణయాన్ని తెల్పుతారని భావిస్తున్నాను అని వ్రాసారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి వారి రజికి ఈ విధముగా సమాధానం వ్రాసి పంపారు. మీ లేఖ నాకు అందినది. రోమన్ సామ్రాజ్యపు చక్రవర్తి హర్కిల్‌ను గూర్చి వ్రాసిన విషయాల ద్వారా నేను పరిస్థితులను అర్థం చేసుకున్నాను. అతడు ఇంతాకియలో ఉండడం. అతనికి అతని సైన్యానికి పరాజయంను కల్గిస్తుంది. మీకు మరియు ముసల్మానులకు అల్లాహ్ వైపు నుండి విజయం అందుటకు కారణమవుతుంది. ఇందులో ఆందోళన చెందవలసిన అవసరం ఏమియు లేదు. మీరు హర్కిల్ తమ రాజ్య ప్రజలను ఏకం చేస్తున్నట్లుగా, పెద్ద సంఖ్యలో ప్రజలు ఏకమవుచున్నట్లుగా వ్రాసారు. అతడు ఇలా చేస్తాడని నేను మరియు మీరు కూడ ఈ విషయాన్ని ముందుగానే గ్రహించాము. ఎందుకనగా ఏ జాతి కూడ యుద్ధం చేయకుండానే తమ రాజరికాన్ని వదిలివేయదు. తన రాజ్యం నుండి వెళ్ళిపోరు. మరల వారు ఇలా వ్రాసారు: అల్ హందులిల్లాహ్! వారితో యుద్ధం చేసే ముసల్మానులలో అధికులు శత్రువులు జీవితాన్ని ప్రేమిస్తున్నట్లుగా వీరు మరణాన్ని ప్రేమిస్తున్నారనే విషయం నాకు తెలుసు. వారు చేయు యుద్ధానికి అల్లాహ్ తాలా నుండి గొప్ప ప్రతిఫలం లభిస్తుందనే నమ్మకాన్ని కల్గియున్నారు. కన్యలపై సంపదపై ఉన్న ప్రేమ కంటే వారు దైవ మార్గంలో యుద్ధం చేయుటకు ఎంతో ఎక్కువ ప్రేమను కల్గియున్నారు. యుద్ధ సమయంలో ఒక ముసల్మానుడు వెయ్యి మంది అన్యారాధుల కంటే ఉత్తముడిగా ఉంటారు. నీవు నీ సైన్యంతో వారిని ఎదురించుము. మిమ్ములను చేరుకోని ముసల్మానుల కోసం ఎదురుచూస్తూ మీరు ఆందోళన చెందకూడదు. నిశ్చయముగా అల్లాహ్ ప్రస్తావన చాలా గొప్పది. అతడు మీకు తోడుగా ఉంటాడు. అతని సాన్నిహిత్యంతో పాటు మీకు సహాయం అందించడం కోసం నేను మీ వద్దకు ప్రజలను పంపుచున్నాను. అనగా సైన్యాన్ని పంపుచున్నాను. మీకు సరిపోతుంది. ఇంకా కావాలనే కోరిక మీకు ఉండదు. ఇన్షా అల్లాహ్ . వస్సలాం (తారీఖుల్ ఖమీస్, సంపుటి 3, పుట 212-213, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2009).

అదే విధముగా హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి గారి లేఖ కూడ హజ్రత్ అబూబకర్ రజికు చేరింది. హజ్రత్ అబూబకర్ రజి అందుకు సమాధానంగా ఈ విధముగా వ్రాసారు? నీ లేఖ నాకు అందినది. అందులో నీవు రోమన్ సైన్యం ఏకమవుచున్న విషయాన్ని ప్రస్తావించారు. గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, అల్లాహ్ తాలా తన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో అధిక సైన్యం ఉన్నందునే మనకు సహాయాన్ని, విజయాన్ని అందించలేదు. మా పరిస్థితి ఎలా ఉండేదనగా, మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి జిహాద్ చేసేవారము, కాని మా వద్ద కేవలం రెండు గుర్రాలు మాత్రమే ఉండేవి. ఒంటెలపై కూడ ఒంతులవారిగా ప్రమాణం చేసేవారము. ఉహద్ యుద్ధంలో మేము

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఉన్నాము. మా వద్ద ఆ సమయంలో కేవలం ఒకే ఒక గుర్రం ఉన్నది. ఆ గుర్రంపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణం చేశారు. అయినా కూడ అల్లాహ్ తాలా మాకు మా శత్రువులపై విజయాన్ని ప్రసాదించాడు. మాకు సహాయం చేస్తూ వచ్చాడు. మరల వారు రజి ఇలా వ్రాసారు: అమర్ ! గుర్తుంచుకో, పాపాల పట్ల ఎక్కువ ద్వేషాన్ని కల్గియున్నవాడే అల్లాహ్ యొక్క ఎక్కువ అనుసరణీయుడు. నీవు కూడ అల్లాహ్‌కు విధేయుడవు కమ్ము. నీ తోటి వారిని కూడ అల్లాహ్‌కు విధేయులను కమ్మని ఆదేశించుము.

(సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజివ్యక్తిత్వం, వ్యవహార శైలి. అలీ ముహమ్మద్ సేలాబి, అనువాదం పుట 452-453, అల్ ఫుర్ఖాన్ ట్రస్ట్ ఖాన్ ఘడ్, పాకిస్తాన్).

హజ్రత్ యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ రజి కూడ హజ్రత్ అబూబకర్ రజి అక్కడి పరిస్థితులను గూర్చి లేఖ వ్రాసారు. సహాయం కోసం సైన్యాన్ని పంపమని వేడుకున్నారు. అందుకు సమాధానంగా హజ్రత్ అబూబకర్ రజి ఇలా వ్రాసారు. శత్రువులతో యుద్ధం చేస్తున్నప్పుడు నీవు నీ మిత్రులతో కలిసి వారిపై ఒక్కసారిగా దాడి చేయండి. వారితో భీకరమైన యుద్ధం చేయండి. అల్లాహ్ మీకు ఎన్నడు అపజయాన్ని చేకూర్చడు. అల్లాహ్ తాలా మనకు అందించిన శుభవార్త ఏమనగా, అల్లాహ్ ఆదేశానుసారం చిన్న చిన్న సైన్యాలు పెద్ద పెద్ద సైన్యాలపై విజయాన్ని సాధిస్తాయి. అయినా కూడ నేను మీ సహాయం కోసం ఒక సైన్యాన్ని పంపుచున్నాను. మీకు సంతృప్తి కల్గును. మీకు ఎలాంటి సహాయం అవసరం ఉండదు. వస్సలాం. హజ్రత్ అబూబకర్ రజి సంతకం చేశారు.

హజ్రత్ అబూబకర్ రజిఆ లేఖను హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖుర్త్ రజిద్వారా హజ్రత్ యజీద్ రజికు పంపించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ రజి వారి రజి లేఖను తీసుకొని బయలుదేరినారు. హజ్రత్ యజీద్ రజి వద్దకు చేరుకొని ముసల్మానుల ముందు ఈ లేఖను చదివి వినిపించారు. ముసల్మానులు ఆనందించారు.

(తారీకుల్ ఖమీస్, సంపుటి 3, పుట 213, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2009)

హజ్రత్ అబూబకర్ రజి హాషిం బిన్ ఉత్బా రజిను పిలిపించి ఇలా అడిగారు. ఓ హాషిమ్! నిశ్చయముగా ఇది నీ అదృష్టం. ఇది నీ భాగ్యం. ఈ సమాజం తన అన్యారాధ శత్రువులకు వ్యతిరేకముగా జిహాద్ చేయుటకు సహాయంను ఆర్జించు వ్యక్తులలో నీవు ఒకరివి. నీవు మంచిని కోరువాడవు. మంచి అభిప్రాయాన్ని తెల్పువాడవు. పవిత్రుడవు. యుద్ధ విద్యలో అనుభవం గలవాడివి. సేనాధిపతికి నమ్మకస్తుడివి. హజ్రత్ అబూబకర్ రజి వారిని అనగా హాషింను ఉద్దేశిస్తూ మరల ఇలా అన్నారు: ముసల్మానులు తమ లేఖ ద్వారా తమ అన్యారాధకులైన శత్రువుకు వ్యతిరేకముగా యుద్ధం చేయుటకు సహాయాన్ని ఆర్జించారు. కావున నీవు నీ మిత్రులతో కలిసి వారి వద్దకు చేరుకొనుము. నీతో పంపుటకు నేను ప్రజలను సిద్ధం చేస్తున్నాను. నీవు ఇక్కడి నుండి బయలుదేరుము. అబూ ఉబైదహ్ రజి వద్దకు చేరుకొనుము. హజ్రత్ అబూబకర్ రజి ప్రజలలో నిలబడ్డారు. అల్లాహ్‌ను స్మరించుకున్నారు. పొగిడారు. ఆపై ఇలా అన్నారు: అమ్మా బాఅద్! నిశ్చయముగా మీ ముసల్మాను సోదరులలో కొందరు క్షేమముగానే ఉన్నారు. కొందరు గాయపడ్డారు. కొందరు యుద్ధాలు చేస్తున్నారు. వారి మంచి చెడులు చూసుకోవడం జరుగుతుంది. అల్లాహ్ తాలా శత్రువుల గుండెల్లో వారి భయాన్ని పుట్టించాడు. వారు తమ తమ కోటలలో తల దాచుకొని కోట ద్వారాలను మూసుకున్నారు.

ముసల్మానుల నుండి రాయబారి ఒక సందేశాన్ని తీసుకవచ్చాడు. అదేమనగా రోమన్ సామ్రాజ్య చక్రవర్తి హర్కిల్ ముసల్మానుల నుండి తప్పించుకొని వచ్చి సిరియా దేశపు సరిహద్దు ప్రాంతంలోని ఒక నగరంలో తల దాచుకున్నాడు. హర్కిల్ ఆ ప్రాంతంలో చాలా పెద్ద సైన్యాన్ని ఏకం చేసి, ముసల్మానులకు విరుద్ధముగా పంపుచున్న సమాచారాన్ని కూడ వారు తీసుకవచ్చారు. కావున మీ ముసల్మాను సోదరులకు సహాయం అందించుటకు మీ సైన్యాన్ని పంపాలని భావిస్తున్నాను. అల్లాహ్ తాలా వీరి ద్వారా మీ ముసల్మాను సోదరుల వెనుకభాగాన్ని కూడ పటిష్టం చేయును. అనగా ఈ సైన్యం ద్వారా ముసల్మానులకు బలాన్ని చేకూర్చును. శత్రువులకు అపజయాన్ని కల్గించును. వారి గుండెలలో భయాన్ని కల్గించును. అల్లాహ్ తాలా మిమ్ములను కరుణించుగాకా!. హాషిం బిన్ ఉత్బాతో మీరు కూడ సిద్ధంగా ఉండండి. మంచిని మరియు ప్రతిఫలమును అల్లాహ్ తాలా నుండి ఆశించుము. ఒకవేళ మీరు సఫలీకృతులైనచో విజయం మరియు యుద్ధ సంపద మిమ్ములను వరిస్తుంది. ఒకవేళ మృతి చెందినచో అమరులవుతారు, మహత్యములను చూస్తారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి తమ ఇంటికి వచ్చారు. ప్రజలు హాషిం బిన్ ఉత్బా వద్ద ఏకం కాసాగారు. చూస్తుండగానే వారి సంఖ్య పెరిగింది. వెయ్యి మందికి చేరింది. హజ్రత్ అబూబకర్ రజి వారిని బయలుదేరమని ఆదేశించారు. హాషిం హజ్రత్ అబూబకర్ రజికు సలాం తెల్పి బయలుదేరినారు. హజ్రత్ అబూబకర్ రజి వారితో ఇలా అన్నారు. ఓ హాషిం! మేము పెద్దవారి, అనుభవజ్ఞుల, సలహాదారుల, వ్యూహకర్తలతో ప్రయోజనం పొందేవారము. యువకుల సహనం, బలం, వీరత్వం వంటి వాటిపై నమ్మకాన్ని పెంచుకునేవారము. అల్లాహ్ తాలా మీలో ఈ లక్షణాలన్నింటిని ఏకం చేశాడు. మీరు ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నారు. శ్రేయస్సుకోసం ముందుకు వెళ్ళుచున్నారు.

శత్రువులతో పోరాడుచున్నప్పుడు నిలకడగా ఉండి పోరాడవలెను. సహనాన్ని ప్రదర్శించుము. గుర్తుంచుకొనుము. దైవ మార్గంలో నీవు వేయు ప్రతి అడుగు, చేయు ఖర్చు, వేసే దప్పిక, కలిగే ఆకలి, ఆవహించే నీరసం అన్నింటికి ప్రతి ఫలముగా అల్లాహ్ తాలా మీ కర్మలను సత్కార్యములుగా లిఖించును. ఉపకారుల ప్రతిఫలమును అల్లాహ్ తాలా ఎన్నడు వృధా చేయడు.

హాషిం ఇలా విన్నవించుకున్నాడు. ఒకవేళ అల్లాహ్ తాలా నాకు ప్రయోజనంను చేకూర్చాలని నిశ్చయించుకున్నచో అతడు తప్పకుండా ప్రయోజనాన్నే చేకూర్చును. నేను కూడ ప్రయోజనాన్నే చేకూర్చేదను. బలాన్ని, శక్తిని అల్లాహ్‌యే అనుగ్రహించువాడు. ఒకవేళ నేను మృతి చెందనిచో నేను శత్రువులతో పోరాడుతూనే ఉంటాను. ఆ తరువాత వారితో పోరాడుతాను, ఆ తరువాత వారితో పోరాడుతాను. మరల ఇలా అన్నారు. ఒకవేళ నేను చనిపోనిచో నేను పదే పదే వారితో యుద్ధం చేస్తాను. బహుశా ఇలా అని ఉండవచ్చును. నేను వీరమరణంను కోరుకుంటున్నాను. పదే పదే మరణించాలని భావిస్తున్నాను. ఇవి రెండు రకాల కథనాలు. ఆ తరువాత వారితో వారి పిన్నాన హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్ రజి ఇలా అన్నారు. ఓ సోదరుడి కుమారుడా! నీవు భర్చీని విసిరేటప్పుడు, దాడి చేయునప్పుడు కేవలం దేవుని ప్రీతి ఉద్దేశమై ఉండాలి. అతి త్వరలో నీవు ఈ ప్రపంచాన్ని వీడి వెళ్ళుతావు అని గుర్తుంచుకో. అతి సమీపంలోనే నీవు అల్లాహ్ వైపు తిరిగి వెళ్ళుదువు. ఈ ప్రపంచం నుండి పరలోకం వరకు నీతో నీ నిజాయితి పరమైన అడుగులే ఉంటాయి. నీవు చేసిన సత్కార్యములు నీకు తోడుగా వస్తాయి.

హాషిం ఇలా అన్నారు: ఓ పిన్నాన్నా!. మీరు రజి ఈ విషయంలో నా పట్ల నిశ్చింతముగా ఉండండి. ఒకవేళ నా ప్రయాణం, విడిది. ఉదయం సాయంత్రపు కదలికలు, ప్రయత్నాలు చేయడం, సైన్యాన్ని నడిపించడం. నా భర్చీతో గాయపర్చడం, నా ఖడ్గంతో శత్రువులను హతమార్చడం వంటివి ప్రజలకు చూపడం కోసమైతే నేను నష్టపోవు వారిలో ఒకడిని. అనగా నా ప్రతి పని అల్లాహ్ ప్రీతి కొరకే చేయబడును. గాని ప్రజలకు చూపించడం కోసం కాదు. ఆ తరువాత వారు రజి హజ్రత్ అబూబకర్ రజినుండి అనుమతి తీసుకొని బయలుదేరినారు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి మార్గంను ఎంచుకొని వారి వద్దకు చేరుకున్నారు. వారు చేరుకోవడంతో ముసల్మానులు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఒకరు మరొకరికి వారి రాకను గూర్చిన శుభవార్తను అందించుకోసాగారు.

హజ్రత్ సయీద్ బిన్ ఆమిర్ బిన్ హిజ్‌యం రజి గారికి హజ్రత్ అబూబకర్ రజి తనను సిరియా యుద్ధంనకు పంపాలనుకుంటున్న విషయం తెలిసింది. హజ్రత్ అబూబకర్ రజి ఇక్కడ మరొక సైన్యాన్ని తయారు చేస్తున్నారు. తన నాయకత్వంలో ఈ సైన్యం బయలుదేరవచ్చునని హజ్రత్ సయీద్ రజి భావించుకున్నారు. మొత్తానికి వారికి ఈ విషయం తెలిసింది. కాని హజ్రత్ అబూబకర్ రజి కొన్ని రోజులు ఆలస్యం చేశారు. కొన్ని రోజుల వరకు వారికి ఈ విషయాన్ని గూర్చి తెలియజేయలేదు. హజ్రత్ సయీద్ రజి హజ్రత్ అబూబకర్ రజి సన్నిధికి చేరుకొని ఇలా విన్నవించుకున్నారు. ఓ అబూబకర్ ! దేవుని ప్రమాణం! మీరు నన్ను రోమన్‌ల వైపు పంపాలని నిశ్చయించుకున్న విషయం నాకు తెలిసింది. కాని మీరు ఈ విషయంలో మౌనంగా ఉండడాన్ని నేను చూస్తున్నాను. నా గురించి మీ మనస్సులో ఎలాంటి ఆలోచనలు ఉన్నాయో నాకు తెలియదు. ఒకవేళ మీరు నన్ను గాకుండా మరెవరినైన పంప దలచినచో నన్ను కూడ వారితోనే పంపించండి. నాకు ఇంతకు మించిన సంతోషకరమైన విషయం మరేమి ఉంటుంది. ఒకవేళ మీరు మరొకరిని పంపడం లేనిచో నేను మాత్రం జిహాద్‌లో పాల్గొనాలనే ఉత్సాహాన్ని కల్గియున్నాను. కావున ముసల్మాను సోదరులను కలుసుకొనుటకు నాకు అనుమతిని ఇవ్వండి. అల్లాహ్ మిమ్ములను కరుణించుగాకా!. రోమన్‌లు చాలా పెద్ద సైన్యాన్ని సిద్ధం చేసుకుంటున్నట్లుగా నాకు తెలిసింది. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు. ఓ సయీద్ బిన్ ఆమీర్! కరుణించేవారిలో అందరి కంటే ఎక్కువ కరుణించువాడు నిన్ను కరుణించుగాకా!. నాకు తెలిసినంత వరకు నీవు మాధ్యమికముగా వ్యవహరించువాడవు, బంధువు మిత్రుల పట్ల దయతో వ్యవహరించేవాడవు. ఉదయం వేళ తహజ్జుద్

సల్పు వాడవు. అధికముగా అల్లాహ్‌ను స్మరించుకొనువాడవు.

హజ్రత్ సయీద్ రజి వారితో ఇలా విన్నవించుకున్నారు. అల్లాహ్ మిమ్ములను కరుణించుగాకా!. ఇంతకు మించి అల్లాహ్ నాపై ఉపకారాలు చేశాడు. అతని అనుగ్రహం మరియు ఉపకారాలు నాపై ఉన్నాయి. దేవుని ప్రమాణం! మీ గురించినాకు తెలిసనదేమనగా, మీరు నిజాన్ని నిర్భయముగా మాట్లాడుతారు. ఎంతో న్యాయబద్ధతను కల్గినవారు, విశ్వాసుల పట్ల దయనీయముగా ఉంటారు. అవిశ్వాసుల పట్ల చాలా కఠినముగా వ్యవహరిస్తారు. మీరు రజి న్యాయబద్ధమైన తీర్మాణాలు చేస్తుంటారు. సంపదను పంచుతున్నప్పుడు ఎవరికి ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వరు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి వారితో ఇలా అన్నారు: ఓ సయీద్ చాలించుము! అల్లాహ్‌నిన్ను కరుణించుగాకా!. వెళ్ళుము, యుద్ధం కోసం ఏర్పాట్లు చేసుకొనుము. సిరియాలో ఉన్నటు వంటి ముసల్మానుల వైపు నేను ఒక సైన్యాన్ని పంపాలను కుంటున్నాను. ఆ సైన్యానికి నిన్నే అమీర్‌గా నియమించాలనుకుంటున్నాను అని తెలిపారు. ఆ తరువాత వారు రజి హజ్రత్ బిలాల్ రజితో ప్రజలలో చాటింపు వేయమని అన్నారు. అందుకు బిలాల్ రజి ఈ విధముగా చాటింపు వేశారు. ఓ ముసల్మానులారా! హజ్రత్ సయీద్ బిన్ ఆమీర్ బిన్ హిజ్‌యం రజి గారితో సిరియాలో యుద్ధం చేయడానికి బయలు దేరండి. కొన్ని రోజులలోనే వారితో 700 మంది సిద్ధమైపోయారు. హజ్రత్ సయీద్ రజి బయలు దేరుచుండగా హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ అబూబకర్ రజి వద్దకు చేరుకొని ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ (స) ఖలీఫా! ఒకవేళ అల్లాహ్ తాలా కొరకు నాకు స్వతంత్రమును కల్పించినచో , నాకు నేను స్వతంత్రుడిని అయినచో , ప్రయోజనం చేకూర్చు వస్తువుల కోసం ప్రయాణించుటకు అధికారం ఉన్నచో మీరు నాకు నా దైవ మార్గంలో జిహాద్ చేయుటకు అనుమతించండి. ఖాళీగా కూర్చోవడం కంటే జిహాద్ చేయడమే నాకు చాలా ఇష్టం.

హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షిగా తెల్పుచున్నాను. నేను అతడి కొరకే నీకు స్వతంత్రమును కల్పిస్తున్నాను. అందుకు బదులుగా నేను నీ నుండి ఎలాంటి ప్రతిఫలమును గాని, కృతజ్ఞతలను గాని ఆశించడం లేదు. ఈ భూమండలం చాలా విశాలమైనది. నీకు ఇష్టమైన మార్గంలో నీవు నడవవచ్చును. హజ్రత్ బిలాల్ రజి ఇలా విన్నవించుకున్నారు. ఓ సిద్దీఖ్ రజి! బహుశా మీరు నా మాటను తప్పుగా భావించవచ్చును. మీరు నా పట్ల కోపంగా ఉండవచ్చును. హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు. లేదు లేదు. దేవుని ప్రమాణం! నీ పట్ల నాకు ఎలాంటి కోపం లేదు. నా కోరిక వలన నీవు నీ కోరికలను వదులుకోకూడదనే నేను కోరుకుంటున్నాను. ఎందుకనగా నీ కోరికలు నిన్ను అల్లాహ్ తాలా విధేయత వైపు పిలుస్తున్నాయి. హజ్రత్ బిలాల్ రజి ఇలా అన్నారు: ఒకవేళ మీరు ఆదేశించినచో నేను మీతోనే ఉంటాను. హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు. నీకు జిహాద్ చేయాలనే బలమైన కోరిక ఉన్నచో నేను ఎన్నడు నిన్ను ఇక్కడే ఉండమని ఆదేశించను. నీతో అజాన్ ఇప్పించాలనే కోరిక మాత్రమే నాకు ఉన్నది. ఓ బిలాల్! నాకు నీవు దూరంగా ఉన్నచో నాకు ఒంటరితనం అనిపిస్తుంది. కాని ప్రళయదినము వరకు కలుసుకోని ఒక వీడ్కోలు మాత్రం ఎన్నడు తప్పదు. ఓ బిలాల్! నీవు సత్కార్యములు చేస్తూనే ఉండాలి. ఈ ప్రపంచం నుండి తీసుకెళ్ళు ఆహార్యం సత్కార్యములే. నీవు ప్రాణాలతో ఉన్నంత కాలం అల్లాహ్ తాలా నీ చర్చించబడును. నీవు మృతి చెందిన చో అల్లాహ్ తాలా నీకు అత్యుత్తమైన ప్రతిఫలమును అందించును. హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ అబూబకర్ రజితో ఇలా అన్నారు: అల్లాహ్ తాలా మీకు ఈ మిత్రుడు మరియు సోదరుడి తరుపున మంచిని అనుగ్రహించుగాకా!.

దేవుని ప్రమాణం! మీరు రజి మాకు అల్లాహ్ తాలా యొక్క విధేయత పట్ల సహనంను పాటించమని, సత్కార్యములను కొనసాగించమని ఆదేశిస్తున్నారు. ఇవి క్రొత్త ఆదేశాలు కావు. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత నేను మరొకరి కొరకు అజాన్ ఇవ్వకూడదని భావిస్తున్నాను.

ఆ తరువాత హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ సయీద్ బిన్ ఆమీర్ రజితో కలిసి యుద్ధానికి బయలుదేరినారు.

(అల్ ఇక్తిఫా బిమా తజ్‌మనా మిన్ ముఘాజి రసూలుల్లాహ్ .... సంపుటి 2, భాగం 1, పుట 130-132, ఆలముల్ కుతుబ్ బెహ్‌రూత్ 1997)

మరొక విన్నపం ఏమిటనగా ఒకవేళ మీరు కేవలం అజాన్ కోసం నన్ను ఇక్కడే ఉండమని కోరినచో నేను అజాన్ ఇవ్వలేను. ఎందుకనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత మరొకరి కొరకు నేను అజాన్ ఇవ్వాలని కోరుకోవడం లేదు. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి వద్ద మరికొంత మంది ఏకమైయ్యారు. వారు రజి వారందరికి హజ్రత్ ముఆవియా రజిను అమీర్‌గా నియమించారు. వారిని వారి సోదరుడైన హజ్రత్ యజీద్ రజితో కలిసిపొమ్మని ఆదేశించారు. హజ్రత్ ముఆవియా రజి ప్రయాణమైయ్యారు. హజ్రత్ యజీద్ రజి వద్దకు చేరుకున్నారు. హజ్రత్ ముఆవియ రజి హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ రజి వద్ద నుండి బయలు దేరగా వారి వద్ద ఉన్నటు వంటి అధిక సైన్యం కూడ హజ్రత్ ముఆవియా రజితో కలిసి ముందుకు వెళ్ళిపోయింది. (తారీఖే తిబ్రి, భాగం 2, పుట 333, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 2012).

ఆ తరువాత హంజా బిన్ మాలిక్ హంజాని మరొక సైన్యాన్ని తీసుకొని హజ్రత్ అబూబకర్ రజి సన్నిధికి చేరుకున్నారు. వారి సైన్యం కూడ వెయ్యి మంది లేదా అంతకు మించి ఉన్నది. హజ్రత్ అబూబకర్ రజి వారి ఏర్పాట్లను, సంఖ్యను చూసి వారి పట్ల చాలా సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఆపై వారితో ఇలా అన్నారు: అల్లాహ్ తాలా ముసల్మానులపై చూపిన ఉపకారానికి కల స్తోత్రములన్నియు అల్లాహ్‌కే చెందును. అల్లాహ్ తాలా ఎల్లప్పుడు వీరి ద్వారా ముసల్మానులకు సహాయంను అందిస్తూ వారికి సులువైన పరిస్థితులను కల్పించాడు. వీరి ద్వారా ముసల్మానులకు వెన్నంటిన సహాయంను అందించి శత్రువుల వెన్నును విరిసాడు.

ఈ క్రమంలో హజ్రత్ హంజా హజ్రత్ అబూబకర్ రజితో ఇలా విన్నవించు కున్నారు: మీరు కాకుండా నాపై మరెవరైన అమీర్‌లు ఉన్నారా?. హజ్రత్ అబూబకర్ రజి ఇలా సమాధానం ఇచ్చారు. అవును. మేము ముగ్గురు అమీర్‌లను నియమించాము. నీవు వారిలో నీకు ఇష్టం వచ్చినవారితో కలిసి వెళ్ళవచ్చును. అప్పుడు హజ్రత్ హంజా ముసల్మానులను కలిసి ఆ అమీర్‌లలో ఎవరు గొప్పవారు, ఎవరు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత సన్నిహితులు అని అడిగి తెలుసుకోగా, హజ్రత్ అబూ ఉబైదహ్ బిన్ జర్రా రజి అని వారికి తెలుపడం జరిగింది. అందుకు వారు వారి సైన్యంలో కలిసిపోయారు. ఎవరైతే ఎక్కువగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో సన్నిహితంగా ఉన్నారో వారితో వెళ్ళడం అనేది వారికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ఉన్నటు వంటి అభిమానానికి ప్రతీక.

జిహాదీ బృందాల పరంపర మదీనాకు రావడం మొదలయ్యాయి. హజ్రత్ అబూబకర్ రజి ఆయా బృందాలను యుద్ధమైదానాల వైపు పంపసాగారు. మరోవైపు హజ్రత్ అబూ ఉబైదహ్ రజి నిరంతరం హజ్రత్ అబూబకర్ రజితో ఉత్తర ప్రత్యుత్తర పరంపరను కొనసాగించేవారు. రోమన్‌లు మరియు వారి నీడలో జీవిస్తున్న తెగల వారు ముసల్మానులతో యుద్ధం చేయడానికి పెద్ద సంఖ్యలో ఏకమవుతున్నారు. ఇలాంటి సమయంలో నేను ఏమి చేయాలో నాకు మార్గదర్శకం చేయండి అని సలహాను కోరసాగారు. (అల్ ఇక్తిఫా బిమా తజ్‌మనా మిన్ మఘాజి రసూలుల్లాహ్ ...... సంపుటి 2, భాగం 1, పుట 133-136, ఆలముల్ కుతుబ్ బెహ్‌రూత్ 1997)

హజ్రత్ అబూ ఉబైదహ్ రజి వరుసగా లేఖలు వ్రాయడం వలన హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజిను సిరియాకు పంపాలని నిశ్చయించు కున్నారు. హజ్రత్ అబూబకర్ రజి ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా ప్రమాణం! నేను తప్పకుండా ఖాలిద్ బిన్ వలీద్ రజి ద్వారా రోమన్‌ల దెయ్యపు ఆలోచనలను అంతమొందిస్తాను. హజ్రత్ ఖాలిద్ రజి ఆ సమయంలో ఇరాక్‌లో ఉన్నారు. హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజిను సిరియాకు చేరుకొని, అక్కడి ఇస్లామీయ సైన్యపు నాయకత్వాన్ని చేపట్టమని ఆదేశించారు. ఆపై హజ్రత్ అబూ ఉబైదహ్ రజికూడ ఇలా వ్రాసారు: నేను సిరియాలోని శత్రువులతో యుద్ధం చేయుటకు యుద్ధ బాధ్యతలను ఖాలిద్‌కు అప్పగించాను. మీరు వారిని వ్యతిరేకించ కండి. వారి సలహాలను పాటించండి. వారి ఆదేశాలను ఆచరించండి. మీరు నా దృష్టిలో గొప్పవారు కాదనే ఉద్దేశంతో నేను వారిని నీపై అమీర్‌గా నియమించలేదు. నిజానికి వారికి ఉన్నంత యుద్ధ నైపుణ్యం మీకు లేదు. అల్లాహ్ తాలా మీ కొరకు మా కొరకు మంచినే కోరుకొనుగాకా! వస్సలాం (అల్ ఇక్తఫా బిమా తజ్‌మనా మిన్ మఘాజి రసూలుల్లాహ్..... సంపుటి 2, భాగం 1 పుట 148, ఆలముల్ కుతుబ్ బెహ్‌రూత్ 1997)(తారీఖుల్ ఖమీస్ సంపుటి 3, పుట 220)

హజ్రత్ ఖాలిద్ రజి ఇరాక్ నుండి సిరియాకు బయలుదేరిన అంశంను గూర్చి ఈ విధముగా వ్రాసారు: హజ్రత్ అబూబకర్ రజి ఉత్తరం హజ్రత్ ఖాలిద్ రజికు చేరుకోగానే వివిధ కథనాల ప్రకారం వారు 500లు, లేదా 600లు లేదా 800 లేదా 1000 మంది సైనికులను తీసుకొని కొన్ని కథనాలలో 9 వేల మంది అని, మరి కొన్ని కథనాలలో 6వేల మంది సైనికులు అని కూడ గలదు. మొత్తానికి ఆ సైన్యాన్ని తీసుకొని సిరియాకు బయలుదేరినారు. కొన్ని కథనాలలో మాత్రం వందల సంఖ్యలు అని మాత్రమే గలదు. కొన్నింటిలో వేల సంఖ్యలో అని గలదు.

మొత్తానికి వారు సిరియాకు బయలుదేరినారు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజిఖురాఖీర్ ప్రాంతానికి చేరుకొని అక్కడి వారిపై దాడి చేశారు. ఆ తరువాత అక్కడి నుండి ఎడారిని దాటుకుంటూ చాలా కష్టాలను, ఇబ్బందులను ఏదుర్కొంటు తమ నల్ల రంగు పతాకంను ఎగరవేస్తూ దిమిష్కస్‌కు సమీపంలోని సనియ్యతుల్ ఉఖాబ్ ప్రాంతానికి చేరుకున్నారు.

ఈ ప్రయాణంనుగూర్చి, ఈ పతాకంను గూర్చి ఈ విధముగా లిఖించబడింది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి ఒక పతాకం ఉండేది. దాని పేరు ఉఖాబ్. ఆ పతాకం వలన ఆ లోతట్టు ప్రాంతానికి సనియ్యతుల్ ఉఖాబ్ అని పేరు పడింది.

(అల్ కామిల్ ఫిత్తారీఖ్, సంపుటి 2, పుట256-258, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2006)(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి అక్బర్ ముహమ్మద్ హుస్సేన్ హైకల్ అనువాదం షేక్ ముహమ్మద్ అహ్మద్ పానిపత్, పుట 350, ఇల్మ్ వ ఇర్ఫాన్ పబ్లికేషన్స్ లాహోర్ 2004)

ఆ తరువాత దిమిష్కస్‌కు చెందిన తూర్పు ద్వారము నుండి ఒక మైళ్ళ దూరంలో ఒక ప్రాంతాన హజ్రత్ ఖాలిద్ రజి బస చేశారు. మరికొన్ని కథనాలలో ఈ విధముగా గలదు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి వారిని ఆ ప్రాంతంలోనే కలిసారు. నిజానికి ఆ రోజే శత్రువుల ముట్టడిని ప్రారంభించారు. మరికొన్ని కథనాలలో ఈ విధముగా గలదు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి దిమిష్కస్ నగరంలో ఎక్కువ రోజులు బస చేయకుండా ముందుకు వెళ్ళి ఖనాతి బుస్రాకు చేరుకున్నారు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి ముసల్మానులతో కలసి బుస్రాకు చేరుకోగా అందరు ఆ ప్రాంతంలో ఏకమయ్యారు. అందరు కలిసి ఇక్కడి యుద్ధంలో వారిని తమ అమీర్‌గా స్వీకరించారు. వారు రజి నగరాన్ని ముట్టడించారు. కొందరు మాత్రం ఈ యుద్ధానికి హజ్రత్ యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ రజి నాయకత్వం వహించారని చెబుతారు. అందుకు కారణం వారు దిమిష్కస్‌కు పర్యవేక్షకులుగా, సేకరులుగా, నాయకుడిగా కొనసాగుచున్నారు. ఇక్కడి నగర ప్రజలు ముసల్మానులతో జిజియా ఒప్పందంపై సంధిని కుదుర్చుకున్నారు. ముసల్మానులు వారి ప్రాణాలకు, వారి సిరిసంపదలకు వారి పిల్లలకు అభయాన్ని కల్పించారు.

(ఫతూహుల్ బల్దాన్ లిల్ బిలాజరి, పుట 174, అనువాదం అబుల్ ఖైర్ మోదూది, నఫీస్ అఖాడమి లాహోర్ 1986)(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ అక్బర్ రజి, ముహమ్మద్ హుస్సేన్ హైకల్ అనువాదం షేక్ ముహమ్మద్ అహ్మద్ పానిపత్ పుట 351, ఇల్మ్ వ ఇర్ఫాన్ పబ్లిషర్స్ లాహోర్ 2004)

అజ్నాదైన్ యుద్ధం లేదా అజ్నాదీన్ యుద్ధం. రెండు విధాలుగా వ్రాసారు: ఈ యుద్ధాన్ని గూర్చి ఈ విధముగా పొందుపర్చడం జరిగింది. ఫలస్తీన్ చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి ఒక ప్రముఖ నగరం పేరు ఇది. (ముఅజముల్ బల్దాన్ సంపుటి 1, పుట 129, దారుల్‌కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)

బుస్రాను జయించిన తరువాత హజ్రత్ ఖాలిద్ రజి, హజ్రత్ అబూఉబైదహ్ రజి, హజ్రత్ షుర్‌హబీల్ రజి మరియు హజ్రత్ యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ రజిలను వెంటతీసుకొని హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజికు సహాయంను అందించడం కోసం ఫలస్తీన్‌కు బయలుదేరినారు. హజ్రత్ అమర్ రజి ఆ సమయంలో ఫలస్తీన్‌కు సమీపంలోని ఒక ప్రాంతంలో బస చేశారు. వారు ఇస్లామీయ సైన్యంలో కలవడానికి ప్రయత్నిస్తున్నారు కాని వారిని రోమన్ సైన్యం వెంబడిస్తుంది. అంతేగాకా వారితో బలవంతముగా యుద్ధం చేయాలని చూస్తుంది. రోమన్‌లు ముసల్మానుల రాకను గూర్చి విన్న వెంటనే వారు అజ్నాదైన్ వైపు వెనుదిరిగారు. హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి ఇస్లామీయ సైన్యంను గూర్చి తెలుసుకొని వారు అక్కడి నుండి బయలుదేరి ఇస్లామీయ సైన్యంలో చేరిపోయారు. ఆ తరువాత అందరు కలిసి అజ్నాదైన్ ప్రాంతంలో ఏకమయ్యారు. రోమన్ సైన్యంతో యుద్ధానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 346-347, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1987) ( అల్ ఖలీఫతుల్ అవ్వల్ అబూబకర్ సిద్దీఖ్ రజి వ్యక్తిత్వం, మరియు కాలం. లిల్ సేలాబి, పుట 312, దారుల్ మాఅరుఫతు)

మరొక కథనములో ఈ విధముగా గలదు. అజ్నాదైన్ వెళ్ళడానికి ముందు హజ్రత్ ఖాలిద్ రజి బుస్రా నగరానికి బదులుగా దిమిష్కస్ నగరాన్ని ముట్టడి చేశారు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి కూడ వారికి తోడుగా ఉన్నారు. ఈ ముట్టడి క్రమంలో హర్కిల్ దిమిష్కస్ ప్రాంత ప్రజలకు సహాయాన్ని అందించడం కోసం ఒక సైన్యాన్ని పంపించాడు. ఆ సైన్యంతో ముసల్మానులు యుద్ధం చేశారు. ఈ యుద్ధంను గూర్చి దిమిష్కస్ విజయ ఘట్టంలో ప్రస్తావించబడును. (హజ్రత్ సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్ పుట 379-380, బుక్ కార్నర్ షోరూం జీహలం)

మొత్తానికి దిమిష్కస్‌ను ముట్టడించిన సమయంలో హజ్రత్ ఖాలిద్ రజి మరియు హజ్రత్ అబూ ఉబైదహ్ రజికు తెలిసిన విషయమేమనగా, హిమస్ పాలకుడు బుస్రాలో ఉన్నటు వంటి హజ్రత్ షుర్‌హబీల్ బిన్ హస్నా రజిను అడ్డుకోవడం కోసం ఒక సైన్యాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. అంతేగాకా రోమన్‌ల ఒక పెద్ద సైన్యం అజ్నాదైన్ ప్రాంతంలో బస చేసింది. ఈ వార్త హజ్రత్ ఖాలిద్ రజి మరియు హజ్రత్ అబూ ఉబైదహ్ రజిలను ఆందోళనకు గురి చేసింది. ఎందుకనగా వారు ఆ సమయంలో దిమిష్కస్‌లో యుద్ధం చేస్తున్నారు. కావున హజ్రత్ ఖాలిద్ రజి మరియు హజ్రత్ అబూ ఉబైదహ్ రజి ఇరువురు పరస్పరం చర్చించుకున్నారు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి తమ అభిప్రాయాన్ని ఈ విధముగా తెలిపారు: మనం ఇక్కడి నుండి బయలుదేరి శత్రువులు హజ్రత్ షుర్‌హబీల్ రజి వద్దకు చేరుకోవడానికి ముందే మనం అక్కడి చేరుకుందాం. అందుకు హజ్రత్ ఖాలిద్ రజి ఒకవేళ మనం హజ్రత్ షుర్‌హబీల్ రజి వద్దకు వెళ్ళినచో అజ్నాదైన్‌లో ఉన్నటు వంటి సైన్యం మనలను వెంటాడుతుంది. అందుకే మనం అజ్నాదైన్‌లో ఉన్నటు వంటి ఈ పెద్ద సైన్యంతోనే యుద్ధం చేయడం సబబుగా ఉంటుంది. అదే విధముగా హజ్రత్ షుర్‌హబీల్ రజికు శత్రువుల కదలికలను ఎప్పటికప్పుడు తెలియజేయమని, సమయం చూసుకొని అజ్నాదైన్‌కు వచ్చి మనతో కలిసి పొమ్మని సమాచారాన్ని పంపుదాము అని తెలిపారు. మరల మనం హజ్రత్ యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ రజికు మరియు అమర్ రజిలకు కూడ సందేశం పంపి వారిని అజ్నాదైన్‌లో కలువని చెబుదాం, ఆ తరువాత అందరం కలిసి మన శత్రువులతో యుద్ధం చేద్దాం. అందుకు హజ్రత్ అబూ ఉబైదహ్ రజి నీ అభిప్రాయం చాలా బాగుంది. అల్లాహ్ తాలా ఈ ప్రణాళికలో శుభమును కల్పించుగాకా! అని పలికి ఆ పథకాన్నే అమలు పరిచారు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజి హజ్రత్ ఖాలిద్ రజికు ఈ విధముగా సలహా ఇచ్చారు. మన సైన్యం సిరియాలో నలుమూలలో విస్తరించి ఉన్నది. కావున వారందరు అజ్నాదైన్‌కు చేరుకొని మనతో కలిసిపొమ్మని వారికి లేఖలు పంపుదాం. ఈ క్రమంలోనే హజ్రత్ ఖాలిద్ రజి దిమిష్కస్ నుండి అజ్నాదైన్ వైపు బయలు దేరు సమయంలో మిగిలిన అమీర్‌లందరికి లేఖలు వ్రాస్తూ అందరిని అజ్నాదైన్‌కు చేరుకొమ్మని సందేశాన్ని పంపారు. హజ్రత్ ఖాలిద్ రజి హజ్రత్ అబూ ఉబైదహ్ రజిలు కూడ తమ సైన్యాన్ని తీసుకొని దిమిష్కస్ ముట్టడిని వీడి అజ్నాదైన్ వైపు వేగంగా ప్రయాణించారు. హజ్రత్ అబూ ఉబైదహ్ రజిసైన్యం వెనుక భాగంలో ఉన్నారు. దిమిష్కస్ ప్రజలు వెంబడిస్తూ హజ్రత్ అబూ ఉబైదహ్ రజి సైన్యాన్ని పట్టుకొని ముట్టడించారు. వారు రజి 200ల మంది సైనికులతో ఉన్నారు. నిజానికి ఈ బృందం మహిళలు, పిల్లలు మరియు సామాగ్రికి చెందిన బృందం. మరొక కథనములో ఈ విధముగా గలదు. వారి పర్యవేక్షణ, రక్షణ కొరకు 1000 మంది సైనికులు కూడ ఉన్నారు. మరోవైపు దిమిష్కస్ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మొత్తానికి వారికి మరియు హజ్రత్ అబూ ఉబైదహ్ రజికు మధ్య భీకర యుద్ధం జరిగింది. మొత్తానికి సైన్యానికి ముందు భాగంలో ఉన్న హజ్రత్ ఖాలిద్ రజికు ఈ సమాచారం అందినది. వెంటనే వారు వెనుదిరిగారు, వారితో పాటు మిగిలిన వారు కూడ వెనుదిరిగారు. ఈ క్రమంలో ఒంటెలు మరియు గుర్రపు సైనికులు రోమన్‌లపై విరుచుక పడ్డారు. వారిలో ఒకరిని మరొకరిపై పడవేస్తూ సుమారు 3 మైళ్ళ దూరం వరకు వెనుకకు నెట్టివేశారు. చివరికి వారు దిమిష్కస్‌లోకి పారిపోయారు. మరోవైపు అజ్నాదైన్‌లో ఉన్నటు వంటి రోమన్ సైన్యం తమ మరో సైన్యానికి మీరు వెంటనే అజ్నాదైన్‌కు చేరుకొమ్మని లేఖ ద్వారా ఆదేశాలు పంపింది. రోమన్‌ల ఈ సైన్యం హజ్రత్ షుర్‌హబీల్ రజితో యుద్ధం చేయుటకు బుస్రా వైపు వెళ్ళుచున్నది. కాని వారు కూడ అజ్నాదైన్ చేరుకున్నారు. అదే విధముగా హజ్రత్ ఖాలిద్ రజి ఆదేశాల మేరకు మిగిలిన ఇస్లామీయ సైన్యం మొత్తం కూడ అజ్నాదైన్‌కు చేరుకున్నది. (తారీఖుల్ ఖమీస్, సంపుటి 3, పుట 228-230, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2009) (మర్దానే అరబ్ పుట 214-216)

రోమన్ సేనాధిపతి ముసల్మానులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారిని వెనుకకు పంపాలని నిర్ణయించుకున్నాడు. అందుకు కారణం ఈరానీయుల వలే రోమన్‌లు కూడ ముసల్మానులను ఆకలి దప్పికలతో అల్లాడిపోయే ప్రజలుగా, తమ పేద దేశం నుండి దోచుకోవడం కోసం వచ్చారని భావించారు. అంతేగాకా వారు కొన్ని శతాబ్దాలుగా సాంప్రదాయ బద్దులుగా, మూర్ఖులుగా, అజ్ఞానులుగా, నిస్సహాయులుగా, నిరాధారులుగా అరబ్ ఎడారులలో జీవనం కొనసాగిస్తున్నందున వారికి ఒక గొప్ప లక్ష్యం ఉంటుదని ఎవరుకూడ అర్థం చేసుకోలేక పోయారు.

అందుకే వారు న హ్రజత్ ఖాలిద్ రజికు ఒక ఆశను చూపారు. అనగా ఒకవేళ మీరు మీ సైన్యాన్ని వెనుకకు తీసుకవెళ్ళినచో ప్రతి సైనికుడికి ఒక చేతి రుమాలు, ఒక జత బట్టలు, ఒక బంగారు దీనార్‌ను బహుమతిగా ఇస్తాము. అదే విధముగా సేనాధిపతికి 10 జతల బట్టలు, వంద బంగారు దీనార్‌లు, ఖలీఫాకు వంద జతల బట్టలు మరియు వెయ్యి బంగారు దీనారులు బహుమతిగా చెల్లిస్తాము అని అన్నారు. రోమన్‌లు ముసల్మానులను దోపిడి దొంగలుగా భావించారు. అందుకే వారికి ఇవి ఇచ్చి వెనుకకు పంపాలని నిశ్చయించుకున్నారు. హ్రజత్ ఖాలిద్ రజి వారి మాటలను విన్న తరువాత వారి ప్రస్తావనను ఎంతో హేళనగా తిరస్కరించారు. ఆపై చాలా కఠినమైన పదాలలో ఓ రోమన్‌లారా! మేము మీ దానధర్మాలను చులకనగా భావిస్తు తిరస్కరిస్తున్నాము. ఎందుకనగా మేము త్వరలోనే మీ సంపదను, మీ ఐశ్వర్యాన్ని, మీ గోపురాలకు, మీ ప్రాంతాలకు యజమానులము అవుతాము అని హెచ్చరించారు.

(అష్ర ముబష్షిరహ్, బషీర్ సాజిద్ పుట 156-157, అల్ బదర్ పబ్లికేషన్స్ లాహౌర్)

ఇరుసైన్యాలు ఎదురెదురు పడగానే రోమన్ సేనాధిపతి ఒక అరబ్ వ్యక్తిని దగ్గరకు తీసుకొని నీవు ముసల్మానుల సైన్యంలో చేరిపొమ్ము, అ అరబ్బుడు ముసల్మానుడు కాదు. నీవు వారిలో ఒక రాత్రి ఒక పగలు ఉండి, వారి సమాచారాన్ని నాకు తెలియజేయుము అని ఆదేశించాడు. ఆ వ్యక్తి ముసల్మానులలో కలిసి పోయాడు. అరబ్ వ్యక్తి అయినందున ఎవరు కూడ అతనిని అనుమానించలేదు. అతడు ముసల్మానుల మధ్య ఒక పగలు ఒక రాత్రి ఉన్నాడు. ఆ తరువాత తిరిగి వెళ్ళిపోయాడు. అప్పుడు ఆ రోమన్‌సేనాధిపతి నీవు ఏ సమాచారాన్ని తీసుకవచ్చావు? అని అడిగాడు. అందుకు ఆ వ్యక్తి సమాచారాన్ని ఎందుకు అడుగుతావు. వారు రాత్రివేళలో ప్రార్థనలు చేస్తుంటారు. రాత్రివేళ ప్రార్థనలలో నిమగ్నమై ఉంటారు, పగలు యుద్ధాలు చేస్తారు. వారు తమ మధ్యలో న్యాయాన్ని స్థాపించడం కోసం ఒకవేళ వారి చక్రవర్తి కుమారుడు దొంగతనం చేసిన కూడ అతని చేతిని నరుకుతారు. ఒకవేళ వ్యభిచారం చేసినచో వారిని రాళ్ళతో శిక్షిస్తారు.

రోమన్ సైన్యాధ్యక్షుడు అతనితో ఇలా అన్నాడు. ఒకవేళ నీవు నాతో నిజం చెప్పుచున్నచో ఈ భూమండలంపై వారిని ఎదురించుటకు బదులుగా ఈ భూమిలో తల దాచుకున్నచో బాగుటుంది. దేవుడు నన్ను మరియు వారిని ఎవరి స్థితిలో వారిని వదిలి నాపై అనుగ్రహించినచో ఇంతకు మించినేను ఏమికోరుకోను. వారికి వ్యతిరేకముగా నాకు సహాయం చేయనక్కరలేదు, నాకు వ్యతిరేకముగా వారికి సహాయం చేయనక్కరలేదు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 347, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2012) తారీఖే తిబ్రిలో ఈ విధముగా వ్రాసి ఉన్నది.

మొత్తానికి ఉదయం వేళ ఇరుపక్షాల సైనికులు ఎదురెదురుగా నిలబడ్డారు. హ్రజత్ ఖాలిద్ రజి బయటికి వచ్చి సైన్యాన్ని క్రమబద్ధీకరించారు. హ్రజత్ ఖాలిద్ రజి ప్రజల మధ్యలో ఉండి వారికి జిహాద్ ప్రాధాన్యతను తెల్పుచున్నారు. ఒకచోట నిలబడేవారు కాదు. ముసల్మాను మహిళలను కూడ పటిష్టముగా నిలబడమని, సైనికుల వెనుకాల నిలబడమని, అల్లాహ్‌తో దుఆలు చేయమని, అతనినే ఆర్జించమని వారు రజి ఆదేశించారు. ముసల్మాను సైనికులలో ఎవరైన వారి ముందు నుండి వెళ్ళుచున్నచో వారు తమ పిల్లలను పైకి లేపేవారు. ఆపై మీరు మీ పిల్లలను, మీ మహిళలను కాపాడడం కోసం యుద్ధం చేయండి అని ప్రోత్సహించేవారు. హ్రజత్ ఖాలిద్ రజి ప్రతి సైనిక బృందం వద్ద నిలబడేవారు. వారితో ఇలా అనేవారు. ఓ అల్లాహ్ దాసులారా! ధైవభీతిని అనుసరించండి. దైవ మార్గంలో దైవాన్ని తిరస్కరించిన వారితో యుద్ధం చేయండి. మీ మడమల ద్వారా వెనుకకు పారిపోకుము. మీరు మీ శత్రువులను చూసి బయపడకూడదు. సింహాల వలే వారిపై పంజా విసరండి. మీ భయం వారిలో కల్గేంత వరకు ముందుకు వెళ్ళండి. మీరు స్వతంత్రులు, గౌరవనీయులు. మీకు ప్రపంచం కూడ ఇవ్వబడింది. ప్రళయదినమున లభించే ప్రతిఫలంకు అల్లాహ్ బాధ్యత తీసుకున్నాడు. మీకు కనబడుతున్న శత్రువు సైన్యపు సంఖ్య మిమ్ములను భయానికి గురి చేయకూడదు. నిశ్చయముగా అల్లాహ్ తాలా తన శిక్షను, ఉక్రోషాన్ని అవతరింపజేయును. హ్రజత్ ఖాలిద్ రజి ప్రజలతో ఇలా అన్నారు. నేను దాడి చేయగానే మీరు కూడ దాడి చేయండి. (తారీఖుల్ ఖమీస్ సంపుటి 3, పుట 230-231, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2009)

ఆ తరువాత ఇరు సైన్యాల మధ్య భీకర యుద్ధం జరిగింది. హ్రజత్ సయీద్ బిన్ జైద్ రజి ముసల్మానులకు ఈ విధముగా హితోపదేశం చేస్తున్నారు. వారిని ఉత్సాహపరుస్తున్నారు. ఓ ప్రజలారా! దేవుని ముందు మీ మరణాన్ని గుర్తు చేసుకోండి. యుద్ధం నుండి పారిపోయి నరకవాసులుగా మారకండి. ఓ తమ ధర్మాన్ని కాపాడుకునేవారలారా! ఓ ఖుర్‌ఆన్ పారయణం చేయువారలారా! సహనంతో వ్యవహరించండి. సహనంను వహించండి. యుద్ధం ప్రారంభమైంది. భీకరముగా కొనసాగింది. రోమన్‌లు పారిపోయా ప్రాణాలను దక్కించుకున్నారు. వారు తప్పించుకొని తమ ప్రాంతానికి చేరుకోగా వర్‌దాన్ వారిని ఉద్దేశించి ఉపన్యసించాడు. ఒకవేళ ఈ పరిస్థితియే కొనసాగినచో ఈ రాజ్యం, ఈ సంపద అన్నియు మన చేయి జారిపోవును. కావున ఇప్పటికైన మన మనస్సులో ఉన్న కల్మషాన్ని తొలిగించుకోవడం చాలా మంచిది. అరబ్‌కు చెందిన ఈ కాపాలదారులు, ఈ ఆకలిదప్పికలు గలవారు, సరిగా దుస్తువులు లేని వారు, బానిసలు మనతో యుద్ధం చేస్తారని ఎన్నడు మనకు ఆలోచనయే తట్టలేదు. వారిని కరువు కాటకాలు మనవైపు వచ్చేలా చేశాయి. ఇప్పుడు వారు మన వద్దకు వచ్చి పండ్లను తింటున్నారు, ఫలాలను ఆరగిస్తున్నారు. జొన్న రొట్టెలకు బదులుగా గోదుమ రొట్టెలు తింటున్నారు. పచ్చడికి బదులుగా తేనేను తింటున్నారు. ఇంజీర్, ద్రాక్ష వంటి మధురమైన ఫలముల మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆ తరువాత అతడు నాయకులను పిలిపించి సలహాలు కోరినాడు. ఒక నాయకుడు ఈ విధముగా అభిప్రాయాన్ని తెలిపాడు. ఒకవేళ ముసల్మానులను ఓడించాలనుకున్నచో ఏదో ఒక కారణం, ఆత్యాశను చూపి వారి నాయకుడిని పిలిపించి మోసపూరితముగా అతనిని హత్య చేసినచో మిగిలిన వారందరు పారిపోతారు అని చెప్పాడు.

నీవు ముందుగా మన జాతికి చెందిన 10 మంది సైనికులను పంపించి ఒకచోట నక్కి కూర్చొమని చెప్పుము. ఆ తరువాత ముసల్మానుల నాయకుడిని ఒంటరిగా మాట్లాడుటకు, చర్చించుటకు ఆహ్వానించుము. ఆ నాయకుడు చర్చిందం కోసం వచ్చినప్పుడు నక్కి ఉన్న మన సైనికులు ఒక్కసారిగా దాడి చేస్తారు, అతనిని హతమారుస్తారు.

ఈ పన్నాగం ప్రకారం రోమన్ సేనాధిపతి అనార్గాళంగా మాట్లాడే ఒక మాటకారిని హ్రజత్ ఖాలిద్ రజి వద్దకు పంపించాడు. రాయబారి ముసల్మానుల వద్దకు చేరుకొని గట్టిగా పిలిచాడు. ఓ అరబ్ ప్రజలారా! ఈ రక్తపాతాన్ని, ఈ హింసను ఇక చాలించరా?. మేము సంధి చేసుకోవడానికి ఒక ప్రణాళికను తయారు చేశాము. కావున మీ నాయకుడు నాతో మాట్లాడడం కోసం ముందుకు వచ్చినచో బాగుటుంది. హ్రజత్ ఖాలిద్ రజి ముందుకు వచ్చారు. అతనితో ఇలా అన్నారు. నీవు తీసుకవచ్చిన సందేశాన్ని వివరించుము. కాని సత్యాన్ని మరవకూడదు. అందుకు అతడు నేను అందుకోసమే వచ్చాను. మా నాయకుడు రక్తపాతాన్ని ఇష్టపడడు. ఇప్పటి వరకు జరిగిన రక్తపాతానికి అతడు బాధపడుతున్నాడు. అందుకే అతడు మీకు కొంత సంపదను ఇచ్చే ఒప్పందం ద్వారా ఈ యుద్ధాన్ని ఆపాలని భావిస్తున్నాడు. కాని సంభాషణల మధ్యలో అల్లాహ్ తాలా ఆ రాయభారి మనస్సులో ఎంతటి భయాన్ని కల్పించాడనగా అతడు హ్రజత్ ఖాలిద్ రజితో అతని భార్య పిల్లల అభయానికి బదులుగా తన నాయకుడు పన్నిన కుట్రను గూర్చి కూడ తెలిపాడు. అతనికి తెలిసిన కుట్ర మొత్తాన్ని, ఏ విధముగా దాచుకొని హ్రజత్ ఖాలిద్ రజిపై దాడి చేయబోతున్నారు అనే విషయాన్ని వివరించాడు. హ్రజత్ ఖాలిద్ రజి ఇలా అన్నారు. ఒకవేళ నీవు నిజంగా ద్రోహం తలపెట్టనిచో నేను నీకు, నీ భార్యపిల్లలకు అభయాన్ని కల్పిస్తాను. ఆ తరువాత అతడు వెళ్ళిపోయాడు. తన నాయకుడి వద్దకు వెళ్ళి హ్రజత్ ఖాలిద్ రజి చర్చలకు సిద్ధముగా ఉన్నారని తెలిపాడు. అతడు చాలా సంతోషించాడు. ఏ ప్రాంతంలోచర్చలు జరపాలని నిర్ణయించుకున్నాడో ఆ ప్రాంతానికి ముందుగానే 10 మంది సైనికులను పంపాడు. అక్కడ అవకాశం కోసం ఎదురు చూస్తూ దాచుకోమ్మన్నాడు. హ్రజత్ ఖాలిద్ రజి ఆ రాయభారి తెల్పినందున అతని కుట్రను తెలుసుకున్నాడు. కావున వారు రజి హ్రజత్ జరార్ రజితో పాటు 10 మంది సైనికులను శత్రువులు దాచుకున్న ఆ ప్రాంతానికి పంపించారు. ముసల్మానులు అక్కడికి చేరుకొని రోమన్ సైనికులను పట్టుకున్నారు, వారిని హతమార్చారు. వారి స్థానంలో వీరు కూర్చున్నారు. హ్రజత్ ఖాలిద్ రజి రోమన్‌ల నాయకుడితో చర్చలు జరపడానికి బయలుదేరినారు. ఇరుపక్షాల వారి సైనికులు పూర్తి భిన్నముగా ఎదురెదురుగా ఉన్నారు. రోమన్‌ల నాయకుడు కూడ అక్కడికి చేరుకున్నాడు. హ్రజత్


**<u>నూరుల్ ఇస్లాం శాఖ:</u>**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

ఖాలిద్ రజి చర్చను ప్రారంభిస్తూ ఇలా అన్నారు. ఒకవేళ మీరు ఇస్లాంను స్వీకరించినచో మీరు మేము సోదరులము అవుతాము. లేదా జిజియాను చెల్లించండి. లేదా యుద్ధం చేయండి.

రోమన్ల నాయకుడికి దాచుకొని కూర్చున్న సైనికులపై నమ్మకం ఉన్నది. అందుకే అతడు ఒక్కసారిగా హజ్రత్ ఖాలిద్ రజిపై ఖడ్గంతో దాడి చేశాడు. ఆపై వారి రెండు భుజాలను పట్టుకున్నాడు. హజ్రత్ ఖాలిద్ రజికూడ అతనిపై దాడి చేశారు. రోమన్ నాయకుడు తన సైనికులను పిలిచాడు. త్వరగా రండి నేను ముసల్మానుల నాయకుడిని పట్టుకున్నాను. మట్టి దిబ్బల వెనుక దాచుకున్న అనుచరులు ఈ పిలుపును వినగానే ఖడ్గాలు చేతపట్టుకొని అతని వైపు పరుగెత్తుకుంటూ వచ్చారు. వర్దాన్ ముందుగా వారిని తమ వారిగా భావించాడు. కాని హజ్రత్ జిరార్ రజిపై అతని దృష్టి పడగానే అతని మతి పోయింది. ఆ తరువాత హజ్రత్ జిరార్ రజి మరియు ఇతర సైనికులు అతని మట్టుబెట్టారు. రోమన్లకు తమ నాయకుడి మరణ వార్త తెలియగానే వారు భయకంపితులైనారు.

(ఫుతూహాతే సిరియా, మౌలానా ఫజల్ ముహమ్మద్ యూసుఫ్ జయీ, పుట 97-104, మక్తబ ఈమాన్ వ యఖీన్ 2011)

ఆ తరువాత ఇరుపక్షాల మధ్య భీకర యుద్ధం జరిగింది. రోమన్ల మరొక నాయకుడు ముసల్మానుల యుద్ధ విధానం చూసి తన వారితో మీరు నా తలకు మీ వస్త్రాలను చుట్టండి అని అరిచాడు. అందుకు వారు ఎందుకు? అని అడుగగా, అతడు సమాధానంగా ఈ రోజు చాలా చెడ్డ రోజు, ఈ రోజును నేను చూడదలచు కోలేదు. నేను ప్రపంచంలో నేటి వరకు ఇలాంటి క్లిష్టమైన రోజును చూడలేదు అని అన్నాడు. కథకుడు ఇలా తెలిపాడు: ముసల్మానులు అతని తలను నరికినప్పుడు అతని తల ఆయా వస్త్రాలలోనే ఉండిపోయింది.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట347, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 1987)

ఈ యుద్ధంలో రోమన్ సైనికులు సుమారు లక్ష మంది వరకు పాల్గొన్నారు. (ఫతూహుల్ బల్దాన్ లి ఇమామ్ అబుల్ హసన్ అల్ బిలాజరి, పుట 47, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2000) ముసల్మానుల సంఖ్య 30వేలు. (అల్ ఖలీఫతుల్ అవ్వల్ అబూబకర్ సిద్దీఖ్ షక్సియ్యతు వ అసరు లిద్దక్తూర్ అలా ముహమ్మద్ సేలాబి, పుట 312, దారుల్ మాఅరుఫతు బెహరూత్ 2006) మరొక కథనములో 35వేల మంది అని గలదు. (అస్హా, ముబష్షిర, బషీర్ సాజిద్, పుట 805, అల్ బదర్ పబ్లికేషన్స్ లాహోర్ 2000) ఈ యుద్ధంలో 30వేల మంది రోమన్ సైనికులు చనిపోయారు. వారి ఓటమిపాలైన సైన్యం అనేక నగరాలకు పారిపోయి ప్రాణాలను దక్కించుకుంది. (తారీఖుల్ ఖమీస్, సంపుటి 3, పుట 231, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2009)

అజ్నాదైన్ విజయం తరువాత హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి హజ్రత్ అబూబకర్ రజికు ఒక లేఖ ద్వారా శుభవార్తను తెలియజేశారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉన్నది. అస్సలాము అలైకుం. నేను మీకు సమాచారాన్ని తెలియజేస్తున్నాను. మాకు మరియు అవిశ్వాసుల మధ్య యుద్ధం జరిగింది. వారు మాకు వ్యతిరేకముగా అజ్నాదైన్లో చాలా పెద్ద సైన్యాన్ని తయారు చేసుకున్నారు. వారు తమ సిలువలను పైకి ఎత్తి పట్టుకున్నారు. వారి గ్రంథాలను పైకి చూపారు. వారు ఎట్టిపరిస్థితులలో పారిపోమని, మమ్ములను అంతమొందిస్తామని, మమ్ములను వారి నగరాల నుండి తరివేస్తామని దేవుని ప్రమాణం చేశారు. మేము కూడ అల్లాహ్ పై పూర్తి నమ్మకంతో విశ్వాసంతో ముందుకు కదిలాము. ఆ తరువాత మేము కొంత సమయం వారిపై భర్సీలతో దాడి చేశాము. ఆ తరువాత మేము ఖడ్గాలను చేత పట్టాము. ఆపై మేము వారితో ఒక ఒంటెను కోసి కూరను వండే అంత సమయం వరకు యుద్ధం చేశాము.

అల్లాహ్ తాలా తన సహాయాన్ని మాకు అందించాడు. తన వాగ్దానంను నెరవేర్చినాడు. అవిశ్వాసులకు ఓటమిని కల్పించాడు. మేము వారిని ప్రతి విశాల మార్గంలో, లోతట్టు ప్రాంతంలో, ప్రతి అడవి ప్రాంతంలో వారిని హతమార్చాము. మన ధర్మాన్ని గెలిపించినందుకు, మన శత్రువులను నాశనం చేసినందుకు, తన మిత్రులతో ఉత్తమముగా వ్యవహరించినందుకు మేము అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెల్పుచున్నాము. ఈ లేఖ హజ్రత్ అబూబకర్ రజి చదివి వినిపించినప్పుడు వారు చివరి దశలో ఉన్నారు. వారికి ఆ విజయం ఆనందాన్ని కల్గించింది. వారు రజి అల్ హందులిల్లాహ్ అని, సకల స్తోత్రములన్నియు అల్లాహ్‌కే చెందును. అతడే ముసల్మానులకు సహాయంను అందించాడు. నా కన్నులకు చల్లదనాన్ని చేకూర్చినాడు అని పలికారు. (తారీఖుల్ ఖమీస్, సంపుటి 3, పుట 231-232, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2009)

అజ్నాదైన్ యుద్ధం ఎప్పుడు జరిగింది అనే అంశంను గూర్చి కొన్ని అనుమానాలు గలవు. కొందరి దృష్టిలో ఈ యుద్ధం హజ్రత్ ఉమర్ రజి కాలంలో జరిగిందని గలదు. ఈ అంశంను గూర్చిన ఒక వివరణ కూడ ఉన్నది దానిని కూడ నేను ఇక్కడ ప్రస్తావించుతాను. ఈ యుద్ధం ఎప్పుడు జరిగింది? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఇందుకు అనేక కథనాలు గలవు. ఒక కథనము మేరకు ఈ యుద్ధం హిజ్రి 13వ సంవత్సరంలో హజ్రత్ అబూబకర్ రజి మరణించడానికి 24 లేదా 20లేదా 34 రోజుల ముందు జరిగినట్లు గలదు. (తారీఖుల్ ఖమీస్, సంపుటి 3, పుట 232, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2009)(ఫతూహుల్ బల్దాన్ లి ఇమామ్ అబుల్ హసన్ అల్ బలాజరి, పుట 74, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2000)

మరికొందరు చరిత్ర కారుల దృష్టిలో ఈ యుద్ధం హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలంలో అనగా హిజ్రి 15వ సంవత్సరంలో జరిగినట్లు పేర్కొన్నారు.

(అల్ కామిల్ ఫిత్తారీఖ్, సంపుటి 2, పుట 266, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2002)

మొత్తానికి మన పరిశోధకులు చేసిన పరిశోధనల ప్రకారం వారు చెప్పునది సరైనదిగానే అనిపిస్తుంది. బహుశా ఇదే సరైనదై ఉండవచ్చును. అనగా అజ్నాదైన్ ప్రాంతంలో రెండుసార్లు యుద్ధం జరుగవచ్చును. మొదటి సారి హజ్రత్ అబూబకర్ రజి గారి కాలంలో, రెండవ సారి హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలంలో. ఎందుకనగా కొన్ని చారిత్రక గ్రంథాలలో రెండు సందర్భాలలో ఇస్లామీయ సైన్యంను వేరు వేరుగా పేర్కొనడం జరిగింది. హిజ్రి 13వ సంవత్సరంలో జరిగిన యుద్ధానికి హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి నాయకత్వం వహించారు. హిజ్రి 15వ సంవత్సరంలో జరిగిన యుద్ధానికి హజ్రత్ అమర్ బిన్ ఆస్ రజి నాయకత్వం వహించారు. మొత్తానికి అల్లాహ్‌యే వాస్తవాన్ని ఎరుగును. వల్లాహు ఆలము.

దిమిష్కస్ విజయాన్ని గూర్చిన వివరాలు ఉన్నాయి. ఇన్షా అల్లాహ్ వాటిని గూర్చి తరువాత ప్రస్తావించుతాను.

---

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అహ్మదియ్య వ్యతిరేకులను హెచ్చరిస్తూ ఇట్లు తెలిపిరి.

"వ్యతిరేకులు తమను అనవసరంగా నాశనం చేసుకుంటున్నారు. నేను వీరి చేతులతో పీకివేయు మొక్కను కాదు. అనేకమంది వివేకులు మీలో నుండి మా జమాత్‌లో చేరుటను గమనించుము. ఆకాశముపై ఒక ఉత్సాహము కలదు. పవిత్ర హృదయాలను దైవదూతలే ఇటువైపు లాగుతున్నారు. ఇక ఈ ఆకాశ కార్యాన్ని మానవుడు ఆపగలడా ? సామర్థ్యమున్నచో ఆపుము. ప్రవక్తల వ్యతిరేకులు చేయు కుట్రలు, కుతంత్రాలు అన్నీ చేయుము. ఏ ఒక్క ఉపాయాన్ని కూడా వదలకుము. సర్వ ప్రయత్నాలు చేసి మరణము సమీపించేంతగా దుఆలు చేసి, ఏం నష్టం కలిగించినారో చూడుము" (రూహానీ ఖజాయిన్ 17, పుట 473, అర్బయీన్).

అహ్మదియ్య అభివృద్ధిని ఆపుటకు వ్యతిరేకులు తమ సర్వశక్తులను ఒడ్డి కూడి ఏమీ చేయలేకపోయారు. అల్‌హ్మదులిల్లాహ్ అలజాలిక్.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అ.త.బి. ఇట్లు తెలిపిరి :

"దైవ వాగ్దానాల ప్రకారం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ.స) జమాత్‌లో ఈ వ్యవస్థ ఖిలాఫత్ వ్యవస్థతో స్థిరపడవలెను. అల్లాహ్ దయతో నేడు ఇది స్పష్టమైన పునాదులపై స్థాపించబడింది. ఏ వ్యతిరేకి శత్రువు దీనికి ఎలాంటి నష్టం కలిగించలేదు. ఇన్షా అల్లాహ్" (అల్‌ఫజల్ ఇంటర్నేషనల్ 14-20 జనవరి, 2005).

| అహదీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

| అహదీస్ బోధనలు | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)*

సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి మార్చి 11, 2016 నాటి జుమా ప్రసంగం.

అనగా ఓ విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడలపై నడువకుము. ఎవరేని షైతాన్ అడుగుజాడలపై నడిచినచో అది నిశ్చయముగా అశ్లీల, అయిష్టమైన విషయములను ఆదేశించును. అల్లాహ్ దయానుగ్రహము, కనికరమే మీ పై యుండనిచో మీలో నుండి ఒక్కరు కూడ ఎన్నడు పవిత్రులు కాలేరు. కాని అల్లాహ్ కోరువానిని పవిత్రునిగా చేయును. అల్లాహ్ సర్వశ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడు.

ఆది నుండి షైతాన్ మానవుని శత్రువు, ఆ శత్రుత్వం తుది వరకుండును. తుది వరకు ఉండుటకు దానిలో ఏదో ఒక శక్తి యున్నదని కాదు. కేవలం తన దాసులు షైతాన్ దాడులనుండి సురక్షితముగా యుందురని అల్లాహ్ తఆలాకు తెలుసినందున మానవుడు జన్మించినప్పుడు అల్లాహ్ తఆలా మానవునికి స్వాతంత్ర్యము ప్రసాదించి అధికారమిచ్చెను. షైతాన్ ముందుకు వచ్చి పోరాడ లేదు కావున దాని శత్రుత్వము ఏదో భహిరంగ శత్రుత్వము కాదు. వివిధ సాకులు, కుట్రలు, ప్రాపంచిక ఈర్ష్యలతో మానవుని అహంకారమును రెచ్చగొడుతు మానవున్ని సత్కార్యముల నుండి దూరము చేయును. దుష్కార్యాములకు సమీపులను చేయును. షైతాన్ దేవునితో ఇట్లనెను. ఏ స్వభావంతోని నీవు మానవున్ని పుట్టించితివో ఆ స్వభావంతోనే నేను వారిని నా అనుచరులుగా మార్చుకుంటాను. అప్పుడు వారు దుష్కార్యముల వైపు ఎక్కువ దృష్టి సారించుదురు. అనగా మానవుడు రెండు వైపుల ఆకర్షితుడగునట్లు అతనిలో స్వభావము గలదు. నీవు నాకు అనుమతిచ్చినచో అన్నిదారుల నుండి నేను అతనిపై దాడి చేయుదును. అన్ని విధాలుగా నేను అతన్ని మోసము చేయుదును. కాని నీ నిజమైన దాసులు, స్వచ్ఛమైన దాసులు నా దాడుల నుండి తప్పించుకొందురు. వారిపై నా ఏ కుట్రలు, కుతంత్రాలు సఫలము కాజాలవు. వారు కాకుండ మిగలినవారందరు నా అడుగుజాడలపైనే నడుచుదురు. అల్లాహ్ దానికి అనుమతిచ్చి, ఇట్లనెను. నీ వెనుక నడిచేవారిని నేను నరకములో పడవేయుదును.

కాని వెంటనే సందేశహరుల పరంపరను ప్రారంభించి, సత్కార్యముల మార్గములను మానవునికి చూపెను. వారికి సంస్కరణ పద్ధతులు కూడ తెలిపెను. తమ ఇహ,పరలోకమును చక్కదిద్దుకునే మార్గమును కూడ సూచించెను. అంతేగాకా షైతాన్ మీ యొక్క శత్రవు అనే వాస్తవాన్ని మరియు అది సానుభూతిని ప్రదర్శించుతు సత్కార్యములవైపు, ప్రయోజనాల వైపు కాకుండ చెడువైపు, నష్టాలవైపు మిమ్ము ఆహ్వానిస్తుందని కూడ తెలుపడమైనది. కాని ఏ రోజున అల్లాహ్ తాలా మానవుని పాపపుణ్యముల లెక్కలను ప్రారంభించునో ఆ రోజు ఈ షైతాన్ చాలా సులువుగా, మొండివైకరని ప్రదర్శించుతు నేను మీకు ఆశ చూపించి దుష్కార్యములవైపు, పాపములవైపు, అల్లాహ్ తాలా ఆదేశాలకు వ్యతిరేకంగా నడుచుటకు ఆహ్వానించినప్పుడు వివేక వంతులైన మీ మానవులు మీ వివేకంను ఎందుకు ఉపయోగించుకోలేదు. సత్కార్యములను ఆచరించుము, ఇతరుల శ్రేయస్సును కోరుకొనుము అనే దేవుని ఆదేశములపై నడుచుకోకుండ చెడువైపు పిలుపునిచ్చిన నా ఆదేశమును ఎందుకు అనుసరించినారని తిరిగి ప్రశ్నించుతూ మీరు చేసిన దానికి ఇప్పుడు ఫలితము అనుభవించుము అని ఎగాతాళి చేయును. అంతేగాకా ఇకపై నాకు మీతో ఎలాంటి సంబంధము లేదు. మీతో శత్రుత్వం చేయడమే నా లక్ష్యం, నా లక్ష్యం నెరవేరినది. మీరు నరకంలో మండిపోవుము అని షైతాన్ మానవునితో శత్రుత్వంను ఏర్పర్చుకొనును.

పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ అనేక చోట్ల షైతాన్ దాడులు, దాని సాకులు, కుట్రల నుండి అల్లాహ్ తఆలా మనలను హెచ్చరించెను. నేను పఠించిన ఈ సూక్తిలో కూడ షైతాన్ ఎల్లప్పుడు మానవున్ని వెంబడించును అని అల్లాహ్ తఆలా మనకు తెలిపెను. ఏనాడైతే షైతాన్ మానవునిపై ముందు నుండి, వెనుక నుండి, కుడి నుండి ఎడుమ నుండి దాడులు చేయుదునని అల్లాహ్ తాలాతో వాగ్దానం చేసెనో అనాటి నుండి అది క్రమం తప్పకుండ నిర్దిష్ట ప్రమాణాలతో దాడులు చేయసాగెను. నేటికి చేస్తూనే ఉన్నది. చివరికి షైతాన్ ఎంతవరకు తెగించినదనగా సన్మార్గంపైనే కూర్చోని మానవులపై దాడిచేయుదునని కంకణం కట్టుకొన్నది. ఒక సాధరణ మానవుడు నేను సన్మార్గంపై నడుచుచున్నాను నేను షైతాన్ దాడుల నుండి సురక్షితంగా ఉండెదని భావించుకొనును. కాని వాస్తవానికి అట్టి వ్యక్తి యొక్క ఈ ఆలోచన చాలా తప్పిదమైనది. ఎందుకనగా ఎవరిపై అల్లాహ్ ప్రకోపం చూపబడినదో, ఎవరు మార్గభ్రష్టులైనారో వారందరు కూడ సన్మార్గంపైనే నడిచినవారు. అంతేగాకా హజ్రత్ మూస అలైహిస్సలాం, హజ్రత్ ఈసా అలైహిస్సలాంలను విశ్వసించినవారే, కాని చివరికి విగ్రహారాధనలకు అలవాటు పడి, మార్గబ్రష్టులై ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లంను తిరస్కరంచిరి. అందువలనే మానవుడు విశ్వసించిన కూడ షైతాన్ అతడిని వెంటాడుచు అతనిని మార్గభ్రష్టున్ని చేయును. చాలా వరకు జనులు షైతాన్ మోసమునకు బలి అయ్యి, షైతాన్ మాటలను అనుసరించుచు మార్గబ్రష్టుడగును. చివరికి ముసల్మానులుగా గుర్తించబడు వారు కూడ మతభ్రష్టులు, దురాచారులుగా మారెదరు. అందుకే ఈ షైతాన్ ప్రమాదం చాలా భయంకరమైన ప్రమాదం. అల్లాహ్ తాలా అనుగ్రహమే మానవులను ఆయా ప్రమాదాల నుండి రక్షించును మరియు రక్షిస్తుంది కూడ.

అల్లాహ్ తఆలా సర్వశ్రవణ సమర్థడను పదముతో ఈ సూక్తి చివరలో విశ్వాసికి నమ్మకమును కల్గించెను. కావున అతని ద్వారములను కొట్టుము. అతన్ని పిలువుము, నిలకడతో పిలువుము. అతని ఆస్థానములో సదా దుఆలు చేయుము. సర్వజ్ఞుడైన ఆ దేవునికి తన దాసుల స్థితులు తెలుసు. నా దాసుడు వినమ్రతతో నన్ను పిలుచుచున్నాడని అతడు చూచినప్పుడు, ఇటువంటి విశ్వాసుని హృదయములో షైతాన్ దాడుల నుండి సురక్షితముగా యుండే శక్తి ప్రసాదించును. సత్కార్యముల అతి గొప్ప ప్రమాణములు అందుకొను అనుగ్రహము లభించుగాక! దుష్కార్యముల నుండి దూరముండే శక్తి అతనికి లభించుగాక!

నీ స్వచ్ఛమైన దాసులు కాకుండ మిగిలిన వారందరు నన్నే అనుసరించెదరు అని షైతాన్ తెలిపినప్పుడు ఒక వివేక వంతుడు, ఒక విశ్వాసి మనము ఏవిధముగా స్వచ్ఛమైన దాసులము కాగాలము అని ఆలోచించవలసి న అవసరం ఎంతైన గలదు. స్వచ్ఛమైన దాసులగుటకు అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో ఒక ఉపాయము తెలిపెను. అది ఏమనగా అశ్లీల, అయిష్టమైన ప్రతి విషయము నుండి మరియు అల్లాహ్ తాలాను అసంతృప్తికి గురిచేయు విషయములన్నింటి నుండి తమను తాము రక్షించుకొనుట. అశ్లీల, అయిష్టమైన విషయము నుండి దూరమున్న వానిని అల్లాహ్ తఆలా కరుణించి పవిత్రము చేయును. అల్లాహ్ తఆలా పవిత్రము చేసిన వ్యక్తి పవిత్రుడగును. ఇటువంటి పవిత్రుల వద్దకు షైతాన్ రాదు.

గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమనగా షైతాన్ దాడి హఠాత్తుగా జరగదు. అది క్రమ క్రమంగా దాడి చేయును. ఒక్క చిన్న పాపమును మానవుని హృదయములో కలిగించి ఇంత చిన్న పాపముతో ఏమి జరుగదు, ఇది ఏమాత్రం పెద్ద పాపము కాదనే ఆలోచనను పుట్టించును. అనంతరం ఈ చిన్న చిన్న పాపములే పెద్ద పాపమును ప్రోత్సహించును. దోపిడీ, హత్యలే పెద్ద పాపములనబడుట అనివార్యము కాదు. సమాజ శాంతిని భంగపరచే ప్రతి చర్య పెద్ద పాపముగానే పరిగణించబడును. మానవుడు తాను ఏమి చేయుచున్నాడనే భావన అంతమైపోవును. అందుకే అల్లాహ్ తాలా ఈ విధముగా తెలుపుచున్నాడు, ఒకవేళ మీరు పరిశుద్దులు కావాలని కొరుకొన్నచో మీరు క్రమం తప్పకుండ పాపములన్నింటి నుండి రక్షించుకొనుచు షైతాన్ అడుగుజాడలో నడవకుండ ఉండుటకు ప్రయత్నిస్తూ, అల్లాహ్ తాలా యొక్క శరణంలో ఉంటూ పరిశుద్ధులగుటకు ప్రయత్నించుట తప్పనిసరి. క్రమం తప్పకుండ అనుక్షణం అల్లాహ్‌ను పిలుచుచు అతని సహాయంను ఆర్జించడం కూడ చాలా అవసరం. ఇలా కాకుండ మరే విధముగా మానవుడు షైతాన్

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*


సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్



SABIR BURQA HOUSE
ALL TYPES OF READYMADE BURQA
ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు
కొరియర్ ద్వారా కూడా పంపబడును
CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

దాడులనుండి రక్షించబడలేదు.

ఇప్పుడు నేను హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కొన్ని ఉపదేశములను మీ ముందు చదివి వినిపించెదను. అల్లాహ్ తఆలా షైతాన్‌ను ఎందుకు సృష్టించినాడు? మొదటి రోజే అతని అహంకారమునకు శిక్షించి, అతన్ని ఎందుకు అంతము చేయలేదు. మొదటి రోజే షైతాన్‌ను అంతమొందించినచో ప్రపంచములో అశాంతి కలిగేదే కాదు కదా అని కొందరి హృదయాలలో ఈ ప్రశ్న తలెత్తును. దీని గురించి హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి.

ప్రతి వ్యక్తికి రెండు రకాల ఆకర్షణలు అనగా ఆకిర్షించు లక్షణములు గలవని ప్రతి ఒక్కరు అంగీకరించుదురు. ఒకటి పుణ్యాకర్షణ, అతన్ని సత్కార్యముల వైపు ఆకర్షించును. రెండవది దుష్టాకర్షణ, అతన్ని దుష్కార్యము వైపు ఆకర్షించును. కొన్ని సార్లు మానవుని హృదయములో దుష్ట ఆలోచనలు కలుగునను విషయము అందరికి తెలిసినదే. అప్పుడుతను పాపమునకు ఎలా ఆకర్షితుడగుననగా ఒకరు అతన్ని పాపము వైపు లాగినట్లు అనిపించును. ఇలాగే కొన్ని సార్లు సత్యాలోచనలు అతని హృదయములో పడును. అప్పుడతడు సత్కార్యము వైపు ఎలా ఆకర్షితుడగుననగా ఒకరు అతన్ని సత్కార్యముల వైపు లాగినట్లు అనిపించును. ఒక్కో సారి ఒక వ్యక్తి పాపము చేసి మరల సత్కార్యము వైపు ఆకర్షితుడగును. నేను దుష్కార్యము చేసితినని చాలా పశ్చాత్తాపపడును. ఒక్కో సారి ఒక వ్యక్తి ఒకరిని దూషించి, కొట్టిన తరువాత పశ్చాత్తాపపడును. నేనీ నీచమైన పని చేసినానని హృదయములో భావించుకొని అతనితో ఏదో పుణ్యము చేసి క్షమాపణ కోరును ( చేడు చేసిన భావన అతనికి కల్గినచో). ప్రతి మానవునిలో ఈ రెండు శక్తులు ఉండును. ( మానవుని స్వభావంను అల్లాహ్ తాలాయే సృష్టించెను.) ఇస్లాం శాసనము పుణ్య స్వభావం గల శక్తికి రుహుల్ ఖుదుస్ అని, చేడు స్వభావపు శక్తిని షైతాన్ అని నామకరణం చేసినది. ఈ రెండు శక్తులు మానవునిలో గలవని తత్వవేత్తలందరు అభిప్రాయపడుదురు. ( అనగా చేడు స్వభావపు శక్తి, పుణ్య స్వభావపు శక్తి, కాని ఇస్లాం శాసనం పుణ్య స్వభావం గల శక్తికి రుహుల్ ఖుదుస్ అని, చేడు స్వభావపు శక్తిని షైతాన్ అని నామకరణం చేసినది) మొత్తమునకు తత్వవేత్తలు ఈ రెండు శక్తులు మానవునిలో గలవని విశ్వసించెదరు. కాని సర్వశక్తి వంతుడైన అల్లాహ్ అంతర్గత విషయాలను కూడ బహిర్గతపర్చి, రాభోవు కాలాలను గూర్చి, దాగియున్న రహస్యములను గూర్చి పూర్తి అవగాహన కల్గినవాడు, అతి సూక్ష్మ అంశాలను కూడ గమనించగల శక్తివంతుడు ఆ రెండు శక్తులను మానవులుగా పేర్కొనడం జరిగినది. ఎవరైతే సత్కార్యములను గూర్చిన ఆలోచనలను కల్గించునో అతని నామము దైవదూత అని, పరుశుద్ధ ఆత్మఅని, మరియు ఎవరైతే చెడు ఆలోచనలను కల్గించెదరో వారు షైతాన్ , ఇబ్లీష్ అని నామకరణం చేయడమైనది. పూర్వపు విజ్ఞావేత్తలు, తత్వవేత్తలు అందరు దైవవాణి వ్యర్ధమైనది, అశ్లీలమైనది కాదని విశ్వసించినారు.

అనగా ఈ సమస్య వ్యర్ధమైనది కాదని, మానవుని హృదయంలో చెడు శక్తి లేదా చెడు ఆలోచనలు మరియు మంచి శక్తి అనే రెండు రకాల శక్తులు గలవని ఇది సరైనదేనని వారు విశ్వసించుతారు. ఈ విషయంను వివరించుచు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధముగా తెల్పిరి:

మానవులందరిలో ఉన్న ఈ రెండు శక్తులు, వాటిని నీవు రెండు శక్తులుగా పిలుచుకున్న లేదా పరిశుద్ధ ఆత్మ, షైతాన్ అని నామకరణం చేసుకొనిన కూడ నీవు ఈ రెండు శక్తుల ఉనికిని తిరస్కరించలేవు. వాటిని పుట్టించుటకు గల కారణం వాటిద్వారా మానవుడు తన సత్కార్యాములకు ప్రతి ఫలము పొందుటకు అర్హుడగును. ఎందుకనగా ఒకవేళ మానవులో కేవలం సత్కార్యములను ఆచరించు శక్తియే యుండి తప్పని పరిస్థితులలో సత్కార్యములను మాత్రమే ఆచరిస్తు దుష్కార్యములనుండి వైదొల్గినచో అప్పుడు మానవుడు చేసిన ఏ సత్కార్యమునకు కూడ ప్రతిఫలము లభించదు. ఇలా ఎందుకు జరుగుననగా అది ఆ మానవునిలో గల ప్రత్యేకత, కాని మానవుని స్వభావం రెండు శక్తుల మధ్యన నలుగుచు కేవలం సత్కార్యపు శక్తివైపే మ్రొగ్గుచూపుచు సత్కార్యములనే ఆచరించినచో ఆ మానవునికి ఆ ఆచరణ వలన తప్పక ప్రతిఫలం లభిస్తుంది.

మానవుని హృదయంలో రెండు రకాల జ్ఞానాలు కల్గుతాయి. కాని ఈ రెండు జ్ఞానాలు మానవుని జన్మలోని భాగాలు మాత్రము కాదని తెలుస్తుంది.( అనగా ఈ రెండు జ్ఞానాలు జన్మత ఏ మానవునికి రావు) ఎందుకనగా ఈ రెండు పరస్పరం భిన్నమైనవి. ( అనగా ఈ రెండు పరస్పరం భేదాభిప్రాయాలు కల్గినవి. చెడు మరియు మంచి అనేవి కలసి ఉండవు. అదే విధముగా భాల్యం నుండే పిల్లల స్వభావంలో మంచి మరియు చెడు అనేవి ఉండవు.) ఈ రెండు విరుద్ధమైనవి. అంతేగాకా మానవుడు వీటిపై ఆధిక్యతను సాధించలేడు. అందువలనే నిర్ధారణ గాబడిన విషయం ఏమిటనగా ఈ రెండు జ్ఞానములు బాహ్య వాతవరణం నుండే జనించును. ( సత్కార్యపు ప్రభావం మరియు దుష్కార్యపు ప్రభావం రెండింటిని మానవుడు పరిసరాల నుండే గ్రహించును. పిల్లలు మెల్లమెల్లగా మంచి వైపు ఆకర్షితులు కావడం, లేదా చేడు వైపు ఆకర్షితులు కావడం ఈ రెండు ప్రక్రియలు బాహ్య పరిసరాలపైనే ఆధారపడి ఉంటాయి.) వాటి ఆధారంగానే మానవుని మనుగడ రూపుదిద్దుకొనును. ఆశ్చర్యకర విషయం ఏమిటనగా ఈ రెండు రకాల స్వభావాలు అనగా దైవదూత స్వభావం, షైతాన్ స్వభావాలను హిందువుల గ్రంధాలు కూడ అంగీకరించుతాయి. మరియు అగ్న్యారాధకులు కూడ విశ్వసించుదురు. ( అనగా అగ్నిని ఆరాదించువారు) . అంతేగాకా దైవం నుండి ఎన్ని గ్రంధాలు అవతరించబడినవో ఆ గ్రంధపు ధర్మములన్నియు ఈ స్వభావాలను స్వీకరించును. అట్టి పరిస్థితులలో మళ్ళీ అభ్యంతరాలు వ్యక్త పర్చడం కేవలం అసూయా, మూర్ఖత్వమే అవుతుంది. ఏవ్యక్తి చెడులనుండి, దుష్టత్వంల నుండి తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించడో అతడు షైతాన్‌గా మారునని అల్లాహ్ తెల్పినట్లు చివరికి అతడు కూడ షైతాగానే మారును అను సమాధానంనే అభ్యంతరాలు వ్యక్తపర్చువారికి నేను ఇచ్చెదను. అలాంటి పరిస్థితులలో అల్లాహ్ తాలా వారిని ఎందుకు శిక్షించడు అని ప్రశ్నించెదరు. ( షైతాన్‌గా పరివర్తనం చెందిన తరువాత వారిని ఎందుకు శిక్షించడం జరుగదనియు ప్రశ్నను లేవనెత్తెదరు.) అందుకు సమాధానం ఏమనగా, అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో షైతాన్‌ను శిక్షించడం కొరకు ఒక నిర్ధిష్టమైన ధినమును నిర్ణయించి యున్నాడు. కావున ఆ రోజు కోసం వేచియుండవలెయును. ( నేను షైతాన్‌ను తప్పక శిక్షించెదను, అది ఎప్పుడనగా , ఈ ప్రపంచములోనైన, పరలోకములోనైన నిర్ధిష్టమైన రోజు తప్పకుండ శిక్షించబడును అని అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు.) ఎన్నో షైతాన్‌లు దేవుని హస్తముల ద్వారా శిక్షించబడినవి. శిక్షించబడును కూడ.

( చస్మాయే మ ఆరుఫత్, రుహాని ఖజాయిన్, సంపుటి 23, పుట 293-294)

ఏయే ఆశలను కల్పించుతు షైతాన్ తనవైపు ఆహ్వానిస్తుందో, ఎలాంటి వ్యక్తిత్వం గలవారు షైతాన్ యొక్క అడుగుజాడలలో నడుస్తుంటారో. ఏ కోరికలను నెరవేర్చుకొనుటకు మానవుడు షైతాన్ అడుగు జాడలను పై నడుస్తుంటాడో వాటనింటిని తెల్పుచు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి:

"షైతాన్ అసత్యం, దైర్జన్యం, ఉద్రేకం, రక్తం ప్రవహించుటకు, గొప్పతనం చాటి చెప్పడం కోసం చేయు పనులవైపు, గర్వం వైపు ఆహ్వానించడం జరుగుతుంది. వీటికి భిన్నమైనవే సద్గుణాలు. గర్వించుము అని ప్రేరేపించును, ఆహ్వానించును. అనగా నీవు ఉన్నతిని కోరుకొనుము అని మిమ్ములను ప్రేమతో ప్రేరేపించుతు చెడువైపునకు ఆహ్వానించును. అందుకు భిన్నమైనవే సద్గుణాలు, ఈ సద్గుణాలను, సహనంను, దైవంలోమమేకమవుటను, స్వచ్ఛతను, విశ్వాస విజయం వైపు అల్లాహ్ ఆహ్వానించును. ఒకవైపు షైతాన్ చెడువైపు ఆహ్వానించుచుండగా, మరోవైపు అల్లాహ్ తాలా సత్కార్యముల వైపు ఆహ్వానించుచున్నాడు. మానవుడు ఈ ఇరు సంఘర్షణల మధ్య సతమతమవుచున్నాడు. అనగా ఒకే రకమైన రెండు రకాల ఆకర్షణల మధ్య నలిగిపోవుచున్నాడు. కాని పరిశుద్ధతను, అదృష్టమును కల్గియున్న స్వాభావికులు తనలో ఉద్రేకములు కల్గియున్న కూడ తన స్వచ్ఛత, పటిష్టత, సురక్షిత స్వభావ శు

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

భముల వలన అతనిని షైతాను వేల సార్లు ఆహ్వానించిన కూడ అతడు అల్లాహ్ వైపే పరుగిడును. అనగా ఎవరి వ్యక్తిత్వంలోనైతే అల్లాహ్ తాలా బుద్ధిమంతుని లక్షణాలను కల్పించునో ఆ వ్యక్తిని షైతాన్ ఏ విధముగా ఆహ్వానించిన కూడ తనలో గల ఉన్నతమైన లక్షణాల వలన, వాటి శుభముల వలన అతడు షైతాన్ వైపు పరుగెత్తె బదులు, అల్లాహ్ తాలా వైపు పరుగెత్తి, అల్లాహ్‌లోనే తన ప్రశాంతతను, తన మనతృప్తిని పొందును. ఎందుకనగా అతడు అల్లాహ్ సన్నిదిలో మ్రొకరిల్లును, అలా మ్రొకరిల్లే గుణం గలవారికి అల్లాహ్ తాలా తనవైపునకు పరుగెత్తె అవకాశంను కల్పించును.

వారు మరల ఇలా తెల్పిరి: ప్రతి వస్తువుకు తప్పనిసరిగా ఒక నిదర్శనము ఉండును. ఎప్పటివరకైతే ఆ నిదర్శనం లభించదో అప్పటి వరకు ఆ వస్తువుపై నమ్మకం కలుగదు. ఒక్క సారి పరిశీలించండి. ఔషధాలను చూడడంతోనే వైద్యుడు దాని స్వభావంను గుర్తించును. ఊదవన్నె వంటి అనేక ఫలాలలో చాలా కాలం పరిశోదించి నిర్ధారించిన తదుపరి కూడ ఒకవేళ ఆ లక్షణాలను పొందనిచో (ఇవి పండ్ల పేర్లు, వీటలో ఔషదగుణాలు కలవు. కావున వీటిని ఔషదములుగా కూడ ఉపయోగించుతారు) వైద్యుడు వాటిని చెత్తచెధారంను పారవేసినట్లు వీటిని కూడ పడవేయును. అదే విధముగా విశ్వాసం కూడ. అల్లాహ్ తాలా పదే పదే తన గ్రంథములో వీటిని గూర్చి ప్రస్తావించడం జరిగినది. ఏ రోజున మానవుని హృదయంలో విశ్వాసం జనించునో ఆ విశ్వాసంతో పాటు అల్లాహ్ తాలా యొక్క గొప్పతనం, అనగా అతని శక్తి, అతని కీర్తి ప్రతిష్ఠలు,అన్నింటిని మించి లా ఇలాహా ఇల్లల్లాహ్ యొక్క సరియైన భావం వారి హృదయంలో చేరుతుంది. తద్వారా అల్లాహ్ తాలా వారిలో ష్థిర నివాసంను ఏర్పర్చుకొంటాడు. తద్వార షైతాన్ జీవితానికి మరణం సంభవించును. అంతేగాకా పాపపు స్వభావం అంతరించిపోతుంది, ఇది ఎంతటి అదృష్ఠమైన జీవితం అనగా ఒకవేళ విశ్వాసం పరిపూర్ణమైనచో అతని పాపపు స్వభావం కూడ మరణించును. అప్పుడే ఒక నూతన జీవితం ప్రారంభమవుతుంది. దాని మరో నామమే ఆధ్యాత్మిక జీవితం. లేదా ఆకాశ జీవనపు తొలిరోజు అని చెప్పుకోవడం జరుగుతుంది. అదే విధముగా ఆధ్యాత్మిక జీవనపు తొలి పుత్రోత్సవంగా లెక్కింపబడుతుంది. ఈ సమయంలోనే మానవుడు అల్లాహ్ భక్తుడిగా మారును.

( మల్ఫూజాత్ సంపుటి 2, పుట 169, ఎడిషన్ 1985)

మరల గర్వం మరియు షైతాన్‌ల యొక్క అనుబంధమును గూర్చి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి:

ప్రథమముగా ఆదమ్ తప్పుచేసెను. ధార్మిక ప్రపంచములో ఆదమ్ మరియు షైతాన్‌ల యొక్క పాపమును గూర్చిన చర్చ గలదు. పాపములు రెండు . ఒకటి ఆదమ్ చేసనది. మరొకటి షైతాన్ చేసినది. కాని ఆదమ్‌లో గర్వం లేకుండెను. అందుకే అతడు ఏవుని సన్నిదలో తన తప్పును అంగీకరించెను. అందువలన అతని పాపమును క్షమించివేసెను. ఆనాటి నుండే మానవుని కొరకు ప్రాయశ్చితముతో పాటు క్షమాపణల ద్వారం తెరువబడినది. గర్వించకుండ, పాపములను స్వీకరించుతూ, ప్రాయశ్చిత్తపడుచూ, క్షమాపణలు కోరుకొన్నచో తప్పక క్షమించబడుతారు. లేదా చివరికి అల్లాహ్ తాలా తప్పకుండ క్షమించుననే నమ్మకం కుదురుతుంది, కాని షైతాన్ గర్వించినది. అందుకే అది శాపమునకు గురి అయినది. అందుకే గర్వితుడైన వ్యక్తి తనలో లేని శక్తి సామర్థ్యంలను కూడ తనలో ఉన్నట్లు అనవసరంగా ప్రగల్బాలు పలుకుచుండురు. గర్వించుటకు కూడ మీకు దైర్యం లేదు, ఎంత వరకు వెళ్ళగలవు, ఎంత ఎత్తుకు ఎదుగగలవు, నీకు శక్తి సామార్ధ్యములు లేనప్పుడు మరి ఎందుకు విర్రవీగుచున్నావు. గర్వితుడు అనవసరంగా తనలో లేని లక్షాణాలను గూర్చి పదే పదే ఉన్నట్లుగా వాగ్దానాలు చేస్తు ఉంటాడు. ప్రవక్తలలో అనేక నైపుణ్యాలు ఉంటాయి. అందులో ముఖ్యమైనది వారు తమ ఉనికిని అంతమొందించుకునే లక్షణం కూడ గలదు. వారిలో స్వార్ధం అనునది ఏ మాత్రం ఉండదు. వారు తమ మనస్తత్వంపై ఒక మరణంను ఆవహింపజేసుకొందురు. గర్వం అనునది కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడినది. ఎవరైతే గర్వంను ప్రదర్శించరో, విధేయతను చూపించెదరో వారు ఏనాడు వృధా కారు.

(మల్ఫూజాత్ సంపుటి 9, పుట 281, ఎడషన్ 1985)

అందుకే గర్వంను విడనాడుము. ఇది విశ్వాసులు అలవర్చుకొవలసిన ఒక ప్రత్యేక లక్షణము. అలా కానిచో వారు షైతాన్ అడుగుజాడలో నడుచువారగుదురు. మానవుడు కొన్ని సందర్భాలలో అహంకారంను చవిచూడడు. అందుకే మనము చాలా జాగ్రతగా మనలను మనము పరీక్షించుకోవలెయును. షైతాన్ ఏవిధముగా మానవున్ని తన ఆధినంలోకి తీసుకొనుటకు ప్రయత్నించునో దానిని గూర్చి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా తెల్పిరి:

పాపపు పనులు మానవుడు చేయకూడదు. ఒకవేళ మానవుని దైనందిన జీవనం నుండి పాపములు దూరమైనచో అనగా పాపమును తలపెట్టు ఏ పని చేయకూడదు, లేదా అతని నడవడికను చూసి ఎవరు కూడ అతడు పాపత్ముడని భావించుకోకూడదు. అట్టి పరిస్థితులలో షైతాన్ కేవలం ముక్కు, కళ్ళు, చెవుల వరకే పరిమితమై ఉండును. ఒకవేళ భాహ్యంగా కూడా మానవుడు పాపములు తలపెట్టకున్నను షైతాన్ మానవుని ముక్కు, కళ్ళు, చెవులలో కూర్చోని ఉండాలని ప్రయత్నిస్తు ఉంటుంది. ఒకవేళ షైతాన్‌కు ఆయా చోట్లలో స్థానం దొరకనిచో కనీసం మానవుని హృదయంలోనైన అది స్థిర నివాసం ఏర్పర్చుకొనుటకు చాలా అధికంగా ప్రయత్నం కొనసాగించును. కొందరు భాహ్యంగా పాపాలు చేయరు. అదే విధముగా పెద్దపెద్ద పాపాలు కూడ చేయరు. అంతేగాకుండ చిన్న చిన్న పాపాలను కూడ వారు చేయరు. కొందరికి పరస్థితులు అనుకూలించవు, లేదా పాపాలు చేయవలసిన పరిస్థతులు కూడ ఏర్పడవు. లేదా వారికి ఎలాంటి భయము ఉండదు. కావాలని , ఉద్దేశపూర్వంగా ఎవ్వరు కూడ పాపాలు చేయాలని ఆశించరు. కాని షైతాన్ మాత్రం మానవుడు ఎప్పుడు దేవుని నుండి దూరం అవుతాడు, నేను ఎప్పుడు, ఏవిధముగా మానవున్ని పాపముల ఊబిలోకి దించెదను, నేను ఎప్పుడు మానవుని హృదయంలో స్థానం సంపాదించుకోగలను అని అనునిత్యం ఆలోచించుతూనే ఉంటుంది. ఈ విధముగా షైతాన్ తన ప్రయత్నాలను చివరి వరకు తీసుకవచ్చును కాని ఏ మానవుని హృదయంలో దైవ భీతి ఉండునో అట్టి హృదయంలో స్థానంను షైతాన్ ఏనాడు సాధించుకోలేదు. ఒకవేళ మానవుని హృదయంలో దైవ భీతి ఉన్నచో షైతాన్‌కు ఆ హృదయంలో పాపపు విత్తనమును విత్తడం ఏమాత్రం సాధ్యం కాదు. చివరికి అట్టి మానవునితో షైతాన్ నిరాశ చెంది, తన ఆయుధాలను, సామాగ్రిని ప్రోగు చేసుకొని, నిరాశ, నిస్పృహాలతో పరాభవంతో అతనిని వీడి వెళ్ళిపోతుంది.

( మల్ఫూజాత్ సంపుటి 3, పుట 401,402. ఎడిషన్ 1985)

అందుకే ముఖ్యంగా మానవుని హృదయంలో దైవ భీతి ఉండవలెయును. దైవభీతి కల్గినప్పుడే మానవుడు అనేక పాపముల నుండి రక్షించబడుతాడు. ఒక దొంగ దొంగతనం చేయును. కాని ఆ దొంగ దొంగతనం చేయుచుండగా ఒక చిన్న బాలుడు చూసిన కూడ అతనిలో భయం కల్గును. అందుకే మానవుడు ఎప్పటి వరకైతే తాను చేయుచున్న పనులన్నింటిని దేవుడు పర్యవేక్షించుచున్నాడని భావించడో, లేదా దేవుడు మన పనులన్నింటిని చూస్తున్నడనే ఆలోచన మానవునిలో జనించదో అప్పటి వరకు మానవుడు పాపముల నుండి రక్షించబడడు. ఎందుకనగా కొన్ని సందర్బాలలో షైతాన్ కూడ మంచి ఆలోచనలను కల్పించుతు కూడ తనను అనుసరింపజేసుకొంటుంది. ఒక సారి ఒక సమావేశంలో దైవవాణి మరియు ఆత్మఘోషణలకు గల వ్యత్యాసంనకు సంబంధించి అనగా దైవవాణిలలో అనేక కష్టములు ఉండును అనే ఆంశంపై చర్చ జరుగుచుండెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమాధానం ఇస్తు ఇలా తెల్పిరి; కొందరు ఆత్మఘోష ,షైతాన్ వాక్యముల లో మరియు దైవవాణి మధ్యలో గల వ్యత్యాసంను అర్ధం చేసుకోలేకపోవుచున్నారు. ఆత్మఘోష మరియు షైతాన్ వాక్యాలను దైవవాణిగా భావించి మోసపోవడం జరుగుతుంది. దేవుని నుండి అవతరించు దైవవాణి తనలో ఒక ప్రత్యేకతను, మరియు ప్రాముఖ్యతను సంతరించుకొని యుండును. అంతేగాకా హృదయంలో ఒక ప్రోత్సాహం జనించును, ఎందుకనగా అది దేవుని వ్రేళ్ళ నుండి వచ్చినది. దానికి సమతూకంగా మరొకటి ఉండదు. అంతేగాకా అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో తెల్పినట్లు " అనా సనుల్కి అలైయిక ఖౌలన్ సఖీలా" వలే అది ఉక్కు లాగా పడుతుంది.

అనగా మేము నీపై అవతరింప జేయు వాణి చాలా బరువును కల్గియుండును. సఖీల్ యొక్క అర్ధం ఇదియే. కాని షైతాన్ మరియు ఆత్మ ఘోష ఇలా ఉండదు. ఆత్మఘోష మరియు షైతాన్ వాక్యములు రెండు ఒకే కోవకు చెందినవై ఉండును. మానవున్ని ఎల్లప్పుడు అంటిపెట్టుకొను రెండు శక్తులు గలవు. ఒక దైవదూత శక్త, మరొకటి షైతాన్ శక్తి, అనగా మానవుని కాళ్ళను త్రాడుతో బంధించినట్లు, దైవదూత సత్కార్యాములవైపు ఆహ్వానించిచు అతనికి సహాయ సహకారములు అందించును. దీనిని గూర్చియే అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో " అయ్యదహుం బిరూహ్" అనగా మేము మా వాణిని పంపించి వారిని ప్రోత్సహించెదము. కాని షైతాన్ ఎల్లప్పుడు చెడునే ప్రేరేపించును. దీనిని గూర్చికూడ అల్లాహ్ తాలా పవిత్ర

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 13 OCT 2022 Issue No. 41.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఖుర్ఆన్‌లో ఈ విధముగా తెలిపెను. “ యువస్ విసు” ఈ రెండు శక్తులను ఎవరు కూడ తిరస్కరించలేరు. అంధకారము, ఉషస్సు రెండు ఒకటికి మరొకటి తోడు ఉండును. విజ్ఞానం లేనందున వాస్తవాన్ని కొట్టిపడవేయలేము. అనగా ఏదేని వస్తువుకు తగిన సమాచారం లేనందున ఆ వస్తువే లేదనుట సమంజసం కాదు. విజ్ఞానంయే గాకా ఎన్నో అద్భుతాలు గలవు. అల్లాహ్ తాలా యొక్క సృష్టిలో గల అద్భుతాలలో ఒకటైన ఈ ప్రపంచమే కాకుండా వేల సంఖ్యలో అనేక అద్భుతాలు గలవు. మరల వారు ( అ.స) లా తెల్పిరి: ఖుల్ అవూజ్ బిరబ్బినాస్, నేటి కాలంలో ప్రజల మధ్యలో మొలకెత్తుచున్న షైతాన్ యొక్క దురాలోచనలను గూర్చి గలదు. ప్రత్యేకించి అభివృద్ది చెందుచున్న కాలంగా పేర్కొనుచున్న నేటి సమయంలో, నేటి రోజులలో ఒక ప్రక్క మానవుడు అల్లాహ్ తాలా నుండి దూరం వెళ్ళుచుండగా మరోవైపు షైతాన్ తన దురాలోచనలను మానవుని హృదయంలో విత్తుచున్నది. అన్నింటిని మించిన దురాలోచన ఏమిటనగా ఏ విధముగానైతే మానవుడు ధనికుల వద్ద ధనమును చూసివారే తనను సంరక్షించు వారని భావించుకున్నట్లు , సంరక్షకుడైన అల్లాహ్‌ను గూర్చియే తప్పుడు అపోహలను కల్పించుచున్నది. కావున ఈ దురాలోచనల నుండి ఏ విధముగా మానవుడు తనను తాను రక్షించుకోగలడో, మరియు ఈ ధనికులు మనలను సంరక్షించుచు మన అవసరాలను తీర్చుచున్నారా? లేదా అల్లాహ్ తాలా మనలను రక్షించుచు మన అవసరాలును తీర్చుచున్నాడా? తెల్పుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధముగా తెల్పిరి:

అందుకొరకే వాస్తవమైన పోషకుని శరణంలో ఉండుటకు మీరు దు:ఆ చేసుకొనుము అని అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు. మరల మానవుడు ప్రపంచపు అధికారులను, నాయకులను తమ అవసారాలను తీర్చువానిగా భావంచును. అందుకొరకే అల్లాహ్ తాలా మలికిన్నాస్ అని దు:ఆ చేయమని తెలుపుచు వాస్తవానికి మానవుని అవసారాలన్నియు తీర్చునది నేనే అని అల్లావ్ తాలా ప్రకటించుకొనుచున్నాడు. మరల మానవుడు తోటి ప్రజల నుండి కూడ భయ భ్రాంతులకు గురి అగును, అంతేగాకా కొన్ని పర్యాయములు మానవునికే దానవుడి స్థానంను కల్పించును. అందుకే “ఇలా ఇన్నాస్” అని దు:ఆ చేయమని తెల్పుచు నేనే మీ ఆరాధ్యదైవంనని అల్లాహ్ తాలా ప్రకటించుకొనెను. ఈ మూడు ఆపోహాలు నుండి మానవజాతిని రక్షించుటకు మూడు తంత్రములు గలవు. ఇవి “సూరయే న్నాస్” లో గలవు. అంతేగాకా ఈ అపోహాలను కల్పించునది షైతాన్. దీని పేరే తౌరాత్ గ్రంధములో ఇభ్రాని భాషలో నాష్ అని, హవ్వా వద్దకు కనుచాటున వచ్చి దొంగతనంనగా దాడి చేసినట్లు పేర్కొనడం జరిగినది. ఈ ఆధ్యాయంలో కూడ దీనిని గూర్చియే గలదు. దీనిని బట్టి అర్ధమగు విషయం ఏమిటనగా దజ్జాల్ కూడ ఎదురెదరుగా పోరాడదు. అది దొంగతనంగా దాడులు చేయును. తద్వారా దాని దాడులు ఏవరికి తెలియకుండును. మిరుమిట్లు జిమ్మే ఈ ప్రపంచపు నూతన పరికరాలు, మరియు నూతన విద్యా విధానం పేరుతో అల్లాహ్ తాలా నుండి ధర్మమునుండి మానవులను దూరం చేయడం జరుగడం, ఇందులో పెద్ద పెద్ద రాజ్యాలు, సంస్థలు పాల్గొని మానవ హక్కుల నామముతో అనేక కల్పిత విషయాలను ప్రస్థావించడం జరుగుతుంది. అంతేగాకా చూడండి మీ ధర్మము మిమ్ములను మీ హక్కులనుండి దూరం చేయుచున్నది, వాస్తవానికి ఈ విషయంలో మానవునికి పూర్తిగా స్వాతంత్రము కావలెయును. ఈ విధముగా నెమ్మది నెమ్మదిగా ఇలాంటి విషపూరిత విషయాలను హృదయంలో విత్తడం జరుగుచుంది. ఈ పనులన్ని నేటి కాలంలో షైతానే చేస్తుంది. హ్యూమన్ రైట్ పేరుమీద, లేదా మహిళ హక్కుల పేరుమీద, లేదా మహిళల అధికారాల పేరున పెద్ద పెద్ద రాజ్యాలే ఈ దుర్మార్గపు చర్యలలో పాలు పంచుకొంటున్నాయి. అంతేగాకుండ నేను ముందే తెల్పినట్లు మానవ హక్కుల సంఘం వారు కూడ ఇందులో భాగాస్వాములవుచున్నారు. ఎక్కడనైతే ధర్మమునుండి దూరం చేయుటకు ప్రయత్నములు కొనసాగుచున్నవో అక్కడ షైతాన్ మనపై దాడులు చేయుచున్నదని, దజ్జాలు శక్తులు మనపై ఆధిపత్యం చెలాయించుటకు ప్రయత్నించుచున్నవని ప్రతి విశ్వాసి, ప్రతి అహ్మదీయుడు, ప్రతి ఒక్కరు అర్ధం చేసుకోవలెను.

మరల వారు ( అ.స) ఇలా తెల్పిరి: షైతాన్ తానంతట తానే హవ్వా వద్దకు వెళ్ళినది అనడం సరికాదు. ఎందుకనగా నేడు అది దొంగచాటుగా దాడులు చేయుచున్నందున ఆనాడు కూడ అది దొంగ చాటునే దాడి చేసి ఉండవచ్చును. ఏ వ్యక్తిత్వం గాని, ఏ వ్యక్తి గాని హవ్వా వద్దకు వెళ్ళలేదు. అది ఈ విధముగానే అపోహలను నింపియుండవచ్చును. వ్యక్తుల మనసులో షైతాన్ తన ప్రభావంను నింపుతుంది. ఆ ప్రభావం షైతాన్‌కు ప్రాతినిధ్యం వహించును. ఎవరో ఒక నాస్తికుడి మనస్సులో షైతాన్ తన ప్రభావంను వేసినది. అంతేగాకా హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం ఉన్నటువంటి స్వర్గం కూడ నేలమీదనే ఉండేది. అంతేగాని ఎక్కడో ఆకాశాన లేదు. ఎవరో ఒకడు దుష్టుడు వారిలో లేనిపోని ఆశలు రేపెను.

అంతేగాకుండ పవిత్ర ఖుర్ఆన్ లోని మొదటి అధ్యాయంలోనే మీరు మార్గభ్రష్టులు, దేవుని ప్రకోపామునకు గురి అయినవారిలో చేరకుము అని ఉపోద్గాతం చేయడమైనది. అనగా: ఓ ముసల్మానులారా! మీరు యూదుల, క్రైస్తవుల చెడుఅలవాట్లకు భానిసలు కాకుము. అనగా ముసల్మానులలో కొందరు వారు గుణగణాలను అలవర్చుకొందురని ఈ ఆదేశములో భవిష్యవాణి గలదు. అనగా రాభోవు ఒక కాలంలో కొందరు ముసల్మానులు యూదులు, క్రైస్తవుల గుణాలను అలవర్చుకొందురు. ఎందుకనగా ఆదేశము అనునది ఎల్లప్పుడు ఒక క్రియకు భిన్నంగా నడుచుకొను కొందరు వ్యక్తులు ఉండెదరని నిర్ధారించుకొన్న పిదప ఆదేశించబడును.

( మల్ఫూజాత్ సంపుటి 2, పుట 244–245, ఎడిషశ్రీన్ 1985)

ఎట్టి పరిస్థితిలోనైనా ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనివ్వవలెనని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. రెండు రకాల ప్రజలు యుందురు. ఒకరు ఇస్లాంను స్వీకరించి ప్రపంచ వ్యాపారములలో నిమగ్నమగుదురు. షైతాన్ వారి తలలపై స్వారీ చేయును. వ్యాపారము చేయుట నిషేధమని నా ఉద్ధేశము కాదు. అనుచరులు వ్యాపారము కూడ చేసేవారు. కాని ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చేవారు. వారు ఇస్లాంను స్వీకరించి హృదయములను నింపి వేయు ఇస్లాం గురించి నిజమైన విద్యను పొందిరి. ఈ కారణము వల్లనే ఏ మైదానములో వారు షైతాన్ దాడికి గురి కాలేదు. సత్యమును బహిర్గత పరచుటకు ఏ విషయము అవరోధముగా మారలేదు. ఈ ప్రస్థావన వెనుక గల నా ఉద్దేశం ఏమనగా ఏవరైతే కేవలం ప్రపంచమునకే అంకితమై పోవుదురో, భానిసలు అగుదురో మొత్తమునకు వారు ప్రపంచ సాదకులు అగుదురు. ఇట్టి వ్యక్తులపైనే షైతాన్ అధిక ప్రభావంను చూపుతుంది. రెండవ వర్గీయులు ధార్మిక అభివృద్ది కొరకు ప్రయత్నాలు చేయుదురు. ఈ వర్గీయులను అల్లాహ్ సైనికులుగా భావించుదురు. అందుకే వీరు షైతాన్ మరియు దాని సైన్యంపైన విజయంను సాదించెదరు. ధన సమీకరణ ఒక వ్యాపారం, వ్యాపారం వలనే ధనం రెట్టింపు అగును. అందుకే అల్లాహ్ తాలా ధర్మసాధనను, ధర్మాభివృద్దిని వ్యాపారముగానే నామకరణం చేసెను. అనగా ధర్మమును సాధించుట, ధర్మాభివృద్ది ఆశించడం ఒక వ్యాపారంవలే ఉండును. ప్రపంచ సంపధంతయు ఈ ప్రపంచములోనే ఉండును. కాని ధార్మిక సంపద ఈ ప్రపంచములోనే గాకుండ పరలోక ంలో కూడ మనకు తోడు ఉండును. అందువలనే అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో “ హల్ హదుల్లుకుం అలా తిజారతిన్ తున్జీకుం మిన్ హజాబిన్ అలీమ్” అనగా నేను మీకు అత్యంత భయానకమైన నరకపు శిక్షనుండి రక్షించు వ్యాపారమును గూర్చి తెలుపవలెనా? ఆ వ్యాపారం చాలా ఉత్తమమైనది. ఆ ఉత్తమమైన వ్యాపారం ధర్మమును సాధించుకొనుట, అదియే భయానకమైన శిక్షనుండి మనలను రక్షించును. అందుకే నేను కూడ అల్లాహ్ తాలా యొక్క పదాలకనుగుణంగా జమాఅత్‌కు తెలియజేయునది ఏమనగా, “ హల్ హదుల్లుకుం అలా తిజారతిన్ తున్జీకుం మిన్ హజాబిన్ అలీమ్”

( మల్ఫూజాత్ సంపుటి3, పుట 193–194, ఎడిషన్ 1985)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz